# విశాల భారతి

తెలుగు దినపత్రిక

08-06-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 154




## ఉచిత వైద్యం ఇవ్వకపోతే రాళ్లతో కొట్టండి

- పార్టీల మధ్య అనైతిక ఒప్పందాలకు చరమగీతం పలకాలి
- ఉచిత విద్యుత్, వైద్యం వంటి హామీలతో అజెండా సిద్ధం
- సింగూర్ ప్రాజెక్టు దుస్థితిపై నేతలను నిలదీశారు
- అధికారంలోకి వచ్చాక ఏడాదితోనే 4 లక్షల ఉద్యోగాలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజకీయాల్లో సముచిత స్థానం
- హామీలు నెరవేర్చకపోతే తనను దండించాలని సవాల్

02



## మరోసారి గ్యాస్ భారం

- ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ. 29 పెరిగింది
- జూన్ 7 నుంచే ధరలు అమల్లోకి వచ్చాయి
- తక్కువ కాలంలోనే మళ్లీ పెంపు జరిగింది
- హైదరాబాద్‌లో ధర రూ. 994కి చేరింది
- నిత్యావసరాల ధరలతో పాటు గ్యాస్ భారం

విశాలభారతి, స్టేట్ బ్యూరో: దేశవ్యాప్తంగా సామాన్య, మధ్యతరగతి కుటుంబాల గృహిణుల బడ్జెట్ పై మళ్ళీ గ్యాస్ ధరల సెగ తగిలింది. వంటగ్యాస్ సిలిండర్ ధరలను చమురు సంస్థలు ఒక్కసారిగా సవరించడంతో వంటగది నిర్వహణ భారంగా మారుతోంది. 14.2 కేజీల బరువున్న గృహ అవసరాల ఎల్పీజీ సిలిండర్ పై 29 రూపాయల మేర భారాన్ని పెంచారు. ఈ సవరించిన ధరలు నేటి నుంచే తక్షణమే అమలులోకి రావడంతో సగటు వినియోగదారుడు ఆందోళనకు గురవుతున్నాడు. కేవలం మూడు నెలల స్వల్ప వ్యవధిలోనే సిలిండర్ ధరలు పెరగడం ఇది రెండవసారి కావడంతో సామాన్యుల జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

02



## ముంచుకొస్తున్న కూరగాయల ముప్పు



- సాగు 5.5 లక్షల ఎకరాల నుంచి 50 వేల ఎకరాలకు తగ్గింది
- రాష్ట్ర అవసరాల్లో 80శాతం బయటి రాష్ట్రాల నుంచే వస్తున్నాయి
- స్థానిక ఉత్పత్తి లేక నిత్యావసరాలు సామాన్యుడికి భారమయ్యాయి
- వరి, పత్తి వంటి వాణిజ్య పంటల వైపు రైతుల మొగ్గు
- సాగును 10 లక్షల ఎకరాలకు పెంచేలా ప్రణాళికలు
- సాగు పెంచకపోతే భవిష్యత్తులో తీవ్ర కొరత తప్పదు

02

# రేవంత్‌కి హిట్లర్ దెబ్బ!



## హిట్లర్ ఆదర్శమన్న రేవంత్ వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత

- కేసీఆర్ లాగే నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శలు
- పేదలపైనే కూల్చివేతలు, బడా నేతలపై మౌనం
- ప్రజాస్వామ్య విరుద్ధ వ్యాఖ్యలపై బీజేపీ, బీఆర్ఎస్ నిరసన
- కేంద్రంతో ఘర్షణల వల్ల రాష్ట్రానికి ఆటంకాలు
- పద్ధతి మార్చుకోకుంటే రేవంత్‌కు కేసీఆర్ గతే పడుతుంది

విశాలభారతి, స్టేట్ బ్యూరో: దూకుడు రాజకీయాలకు చిరునామాగా మారిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాజాగా చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ వర్గాల్లో పెను సంచలనం రేపాయి. ఒకవైపు ప్రతిపక్షాలపై విమర్శల దాడి, మరోవైపు తనపై వస్తున్న ఆరోపణలను తిప్పికొట్టే క్రమంలో ఆయన మాటల డోస్ పతాక స్థాయికి చేరింది. అయితే ఈ ధోరణి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తరహా నియంతృత్వ పోకడలను గుర్తుకు తెస్తోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. స్వతహాగా ఫుట్‌బాల్ క్రీడాభిమాని అయిన రేవంత్ రెడ్డి, ఇటీవల ఒక జాతీయ స్థాయి పత్రిక నిర్వహించిన కార్యక్రమంలో అడాల్ఫ్ హిట్లర్ తనకు ఆదర్శమని ప్రకటించడం రాజకీయ విశ్లేషకులను విస్మయానికి గురిచేసింది. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీని సైతం రక్షణలో పడేస్తూ, సొంత ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేలా మారుతున్నాయి. ప్రపంచ చరిత్రలో అత్యంత క్రూరమైన నియంతగా ముద్రపడిన అడాల్ఫ్ హిట్లర్ తన ఆదర్శమని, ఆయన కోర్ టీమ్ పేరు మీదుగానే

మిగతా 3లో..

## నరరూప రాక్షసుడు నీకు రోల్ మోడలా?



- హిట్లర్‌ను ఆదర్శంగా భావించడంపై తీవ్ర అభ్యంతరం
- బుల్డోజర్ దాడులు నాజీల అరాచకాలను తలపిస్తున్నాయి
- నియంతృత్వ ధోరణి రాజ్యాంగ వ్యవస్థకే ప్రమాదకరం
- సంక్షేమ రాష్ట్రాన్ని విధ్వంసక సంక్షోభంలోకి నెట్టారు
- రేవంత్ పాలన నుంచి విముక్తి కోసం పోరాటం ఖాయం
- నియంతృత్వ పాలనకు ప్రజలే చరమగీతం పాడతారు

విశాలభారతి, స్టేట్ బ్యూరో: రాష్ట్ర రాజకీయ యవనికపై అకస్మాత్తుగా తీవ్రస్థాయి మాటల యుద్ధం మొదలైంది. కోట్ల మందిని ఊచకోత కోసిన నరరూప రాక్షసుడు హిట్లర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రోల్ మోడలా అంటూ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సంచలన ప్రశ్నలు సంధించారు. మానవ జాతి చరిత్రలోనే అతిపెద్ద

మిగతా 3లో..



## పంట మార్పిడిపై ప్రభుత్వ ఆపదమొక్కులు

- రైతులను పాలకులు రాజకీయాల కోసం వాడుకుంటున్నారు
- విదేశీ పత్తి దిగుమతుల వల్ల రైతులు నష్టపోతున్నారు
- ఆచరణాత్మక విధానాలు లేక రైతులు ఇబ్బందిపడుతున్నారు

02

## నీ సంగతి చూస్తా కిషన్ రెడ్డి

- మూసీ ప్రక్షాళనకు అడ్డంకిగా కిషన్ రెడ్డి
- పర్యాటక కేంద్రంగా మార్చడమే లక్ష్యం
- అనుమతులు, నిధుల విషయంలో కిషన్ రెడ్డి అడ్డు
- కేంద్రం సహకరించకపోతే పోరాటం చేస్తాం

03



## చర్చకు సిద్ధమా రేవంత్?

- నిధులు, అనుమతులపై రేవంత్, కిషన్ రెడ్డి మధ్య మాటల యుద్ధం
- అభివృద్ధిని కేంద్రం, కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపణ
- అస్పష్టమైన లెక్కలు, డీపీఆర్ లేని ప్రాజెక్టులపై కిషన్ రెడ్డి ప్రశ్నలు
- భారీ వ్యయం, నిధుల వినియోగంపై కేంద్రం అనుమానం
- ఏ వేదికపైనైనా చర్చకు ఇద్దరు నేతల సవాళ్లు
- రాజకీయాలు పక్కనపెట్టి అభివృద్ధిని వేగవంతం చేయాలి

విశాలభారతి, స్టేట్ బ్యూరో: తెలంగాణ రాజకీయ యవనికపై ప్రస్తుతం అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలు శృతి మించుతున్నాయి.

మిగతా 3లో..



## కాంగ్రెస్ పోవాలి.. కేసీఆర్ రావాలి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** పెద్దపల్లి వేదికగా రేవంత్ రెడ్డి సర్కారు వైఫల్యాలపై మాజీ మంత్రి హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. కేసీఆర్ హయాంలో స్వర్ణయుగంలా సాగిన తెలంగాణ, నేడు కాంగ్రెస్ పాలనలో అంధకారంలోకి వెళ్తోందని ఆయన మండిపడ్డారు. పెద్దపల్లి పట్టణంలో జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆయన, రైతులు, విద్యార్థులు, పోలీసుల కష్టాలను అంకెలతో సహా ఏకరువు పెట్టారు. ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన

మిగతా 4లో..

- కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అంధకారంలోకి వెళ్లింది
- రైతుబంధు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటివి నిలిపివేశారు
- రుణమాఫీ, ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం ఘోర విఫలం
- ఉచిత కరెంట్ కోత, పోలీసుల ఆర్థిక ప్రయోజనాల రద్దు
- కార్యకర్తలను వేధిస్తే భవిష్యత్తులో చర్యలు తప్పవు
- 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం

# పంట మార్పిడిపై ప్రభుత్వ ‘ఆపదమొక్కులు’

- రైతులను పాలకులు రాజకీయాల కోసం వాడుకుంటున్నారు
- విదేశీ పత్తి దిగుమతుల వల్ల రైతులు నష్టపోతున్నారు
- ఆచరణాత్మక విధానాలు లేక రైతులు ఇబ్బందిపడుతున్నారు
- లాభసాటిగా లేక వరినే నమ్ముకుని రైతులు నష్టపోతున్నారు
- వరి తగ్గించి ఇతర పంటలకు రూ. 8,000 సాయం యోచన
- ఆయిల్ పామ్, సహజ వ్యవసాయంపై ప్రభుత్వం దృష్టి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తూ.. రైతులకు ఆర్థికంగా, భౌతికంగా ఆ పంటల సాగు లాభసాటి అనే భరోసా కల్పించకుండా నిర్లక్ష్యంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. పాలకులెవరైనా ‘రైతులను... పంట సాగును’ కూడా తమ రాజకీయ రథ చక్రాల కిందకు లాగుతున్న వైనమే దీనికి ప్రధాన కారణమంటున్నారు. అధికారంలో ఉన్న పార్టీలు తమ విదేశీ తాబేదారితనంతో దేశీయ రైతుల జీవితాలను పనంగా పెడుతున్నారని, కనీస మద్దతు ధర దక్కకుండా రైతుల జీవితాలను బలిపెడుతున్నారనే విమర్శలున్నాయి. దేశంలో రైతులు పత్తి పండిస్తే ఇక్కడి రైతుకు ధర రాకుండా అమెరికా నుంచి పత్తి దిగుమతి చేసుకునే విధంగా విదేశీ దిగుమతి సుంకాన్ని తగ్గించి గేట్లు బార్లా తెరువడంతో ఇక్కడి రైతు పిడుగుపాటుకు గురయ్యారు. రైతును ఆదుకోవడంలో పాలకులకు చిత్తశుద్ధి లేదని పదపదే నిరూపించుకుంటుండగా, పార్టీలైవైనా నేతల దిగజారుడు తనం మరో కారణంగా మారుతోందనే విమర్శలున్నాయి. రాష్ట్రంలో గత రెండు నెలలుగా ధాన్యం, మొక్కజొన్న రైతులు రోడ్లపై నిరీక్షిస్తున్న పరిస్థితి దీనికి అద్దంపడుతోందంటున్నారు. గతంలో కూడా దీనికి భిన్నమైన పరిస్థితులు లేకపోవడం గుర్తు చేస్తున్నారు. పంటమార్పిడి, ప్రత్యామ్నాయ పంటల సాగు విషయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు నేలవిడిచి సాము చేస్తున్న విధానాల ఫలితంగా రైతులు నమ్మకం కోల్పోతున్నారు. ఈ కారణంగా రైతులు సంప్రదాయ సాగు పద్ధతులూ, పంటల సాగును కొనసాగిస్తూ ‘ఊబి’లో కూరుకుపోతున్నారు. ఆరుగాలం శ్రమించి, అన్ని రకాల ఆటుపోట్లను, ఆర్థిక అవస్థలను అనుభవించి కూడా ప్రతి సీజన్‌లో రెక్కల కష్టమైనా మిగులుతుందో లేదో చివరి వరకు తేలని దుస్థితిని ఎదుర్కొంటున్నారు. నెత్తునను చెమటగా మార్చి పండించిన పంటను విక్రయించుకునేందుకు కల్లాల్లో కళ్ళల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూడాల్సిన దుస్థితిని ప్రతీ సీజన్ లో రైతులు అనుభవిస్తున్నారు.

**పంట మార్పిడి...ప్రత్యామ్నాయం పై ఏదీ చిత్తశుద్ధి?**

ప్రతీ ఖరీఫ్ ప్రారంభానికీ, రబీ ముగింపునకూ పంట మార్పిడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపైన అధికారంలో ఉన్న నేతలు ఊకదంపుడు ఉపన్యాసాలివ్వడం రివాజుగా మారింది. రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి, ప్రభుత్వ ఆర్థిక, భౌతిక సహాయ సహకారం, రైతుల స్థితిగతులు అన్నీ తెలిసినప్పటికీ పక్కా ప్రణాళిక రూపొందించి అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతు సంఘాల నేతలు చెబుతున్నారు. దీంతో రైతులు కూడా నీటి వనరులు ఉంటే వరి వైపు, కొంచెం తక్కువ నీటి వనరులుంటే పత్తి, మొక్కజొన్న, మిరప వైపు మొగ్గుచూపుతున్నారని చెబుతున్నారు. ఫలితంగా పప్పు ధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తి తగ్గిపోయింది. రైతుకు లాభసాటిగా లేకపోవడంతో పై పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో ఎక్కడ చూసినా వరి, మొక్కజొన్న, పత్తి తప్ప మరో పంట వైపు దృష్టి పెట్టడం లేదు. దీంతో పంటలు పండినా.. కొనేవారు లేక, సరైన ధర లభించని దుస్థితి నెలకొంది. చివరికి ప్రభుత్వ కొనుగోలు వైపు చూడాల్సి వస్తోంది. దేశంలో ఒక వైపు వంట నూనెలను దిగుమతి చేసుకుంటూ ఇక్కడ నూనెగింజలు, పప్పుధాన్యాలు, ఇతర వాణిజ్య పంటల సాగును ప్రోత్సహించకపోవడానికి ఆచరణాత్మక ప్రణాళిక లేకపోవడమే కారణం అంటున్నారు. రాష్ట్రంలో ఇటీవల పామాయిల్ సాగు కాసింత పెరుగుతోంది.

**వరి, పత్తి, మొక్కజొన్న పంటల మొగ్గు**

తెలంగాణ రాష్ట్రంలో రోజురోజుకు సాగు విస్తీర్ణం ఆశించిన మేరకంటే ఎక్కువగా పెరుగుతోంది. ఈ సాగులో కూడా అనూహ్యంగా వరి సాగు విస్తీర్ణం పెరగడం గమనార్హం. రాష్ట్రం ఏర్పడిన 2014లో మొత్తం 1.31 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగుచేయగా ప్రస్తుతం సాగు విస్తీర్ణం 2.2 కోట్ల ఎకరాలకు పెరిగింది. దాదాపు 90లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగిదంటేే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ విస్తీర్ణంలో ప్రధాన వాటా వరిదే కావడం విశేషం. గతంలో కేవలం 30 శాతం ఉన్న వరి సాగు ఇప్పుడు 60 శాతానికి చేరింది. ఖరీఫ్ సీజన్ లో వరి సాగు 68.3 లక్షల ఎకరాల్లో సాగు చేస్తుండగా, రబీలో కూడా కొద్ది మేరకు తక్కువ అంటే 64.36 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. వార్షిక ధాన్యం ఉత్పత్తి 2.96 కోట్ల మెట్రిక్ టన్నులకు చేరిందంటే సింహభాగం వరిసాగు చేస్తున్నారు. మిగిలిన పంటలతో పోల్చితే వరి రైతుకు కొంత ఉపశమనం కలిగిస్తోంది. హెక్టారు వరి సాగు ఖర్చు రూ.1,15,673లుండగా - పత్తి తర్వాత 2వ స్థానంలో ఉంది, దేశంలో తెలంగాణ వరిసాగు వాటా గతంలో 13.6 శాతం ఉంటూ పంజాబ్ తర్వాత 2వ స్థానం ఉండేది. తాజాగా 2026 రబీలో తెలంగాణ వరి పంట ఉత్పత్తి దేశంలోనే అగ్రస్థానానికి చేరుకున్నది. ఇక వరి తర్వాత రెండవ స్థానం వాణిజ్యపంటగా గుర్తింపు పొందిన పత్తికి దక్కుతోంది. తెలంగాణలో పత్తి సాధారణ విస్తీర్ణం 44 లక్షల ఎకరాల్లో ఉండగా మొన్నటి ఖరీఫ్ అంచనా ప్రకారం 49. 98 లక్షల ఎకరాలకు పైగా సాగు చేస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. 2020 - 21లో 58.26లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తర్వాత స్థానం మొక్కజొన్నకు దక్కుతోంది. కేవలం ఈ రబీ సీజన్ లోనే 14.99 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఖరీఫ్లో మరో 10లక్షల ఎకరాల మేరకు సాగు చేశారు. రబీ సీజన్ లో ధాన్యం తర్వాత మొక్కజొన్నకే రైతులు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆరుతడి పంటగా దీని పై మక్కువ కనబరుస్తున్నారు. ఇక మిరప ఉత్తర తెలంగాణలోని ఖమ్మం, వరంగల్ జిల్లాలో ఎక్కువగా సాగు చేస్తున్నారు. తర్వాత సోయాబీన్ వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. ఇటీవల ఆయిల్ పామ్ సాగుకు ప్రాధాన్యం ఇవ్వడంతో రాష్ట్రంలో 12 వేల ఎకరాల విస్తీర్ణానికి చేరింది. ఈ ఏడాది ఆయిల్ పామ్ సాగు పెరిగింది. రబీలో వరి, మొక్కజొన్నతో పాటు 4 లక్షల ఎకరాల్లో జొన్న, 1.6 లక్షల ఎకరాల్లో వేరుశెనగ, 1.56 లక్షల ఎకరాల్లో శెనగ, 26వేల ఎకరాల్లో మినుము సాగు చేస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో వల్ల వర్షాభావం ఉంటుందనే కారణంతో పంటమార్పిడి ప్రధాన చర్చనీయాంశంగా మారింది. సీఎం రేవంత్ నుంచి.. అందరూ ఇదే పాట పాడుతున్నారు. రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల వరిని ఇతర పంటలకు మార్చాలని లక్ష్యంతో ప్రణాళిక రూపొందించారు. దీనికి ప్రోత్సాహకంగా వరి వదిలి ఇతర పంటలు వేస్తే ఎకరానికి రూ.8,000 ఇవ్వాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిపాదనలు రూపొందించింది. ప్రత్యామ్నాయంగా కందులు, నూనెగింజలు, ఉద్యాన పంటలు వేయాలని సూచిస్తున్నారు. దీంతో పాటు విపరీతంగా పెరిగిన ఎరువులూ, పురుగుల మందుల వినియోగం తగ్గించి సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించారు. 61,125 ఎకరాల్లో నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ కింద ఈ ఖరీఫ్ నుంచి ప్రారంభం ఆయిల్ పామ్ ను ప్రోత్సహించాలని భావిస్తున్నారు. ఇప్పటివరకు 12,005 హెక్టార్లు కొత్తగా సాగుచేయగా, దేశంలో ఆంధ్రప్రదేశ్ తర్వాత తెలంగాణ 2వ స్థానంలో చేరింది. వరి స్థానంలో ఇతర పంటలను ప్రోత్సహించడం వల్ల నీటి వనరులపై ఒత్తిడి తగుతోంది. దీని కోసం కూడా తాజా ఎలినినో పరిస్థితిల్లో పంట మార్పిడిని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెబుతున్నారు.

## లింగ్యా తండలో మహిళా సమైక్య భవనాల శంకుస్థాపన ఘనంగా ప్రారంభం

- మహిళా సాధికారతకు మరింత బలం చేకూర్చనున్న భవనాలు
- మహిళల అభివృద్ధికి మరో ముందడుగు
- లింగ్య తండలో మహిళా సమైక్య భవనాల నిర్మాణానికి శ్రీకారం
- మహిళా సంఘాల బలోపేతానికి ప్రత్యేక వేదిక
- డోర్నకల్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఊతం
- మహిళా సాధికారతే సమాజ ప్రగతికి పునాది
- డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్



**కురవి విశాల భారతి:** కురవి మండలంలోని లింగ్య తండలో మహిళా సమైక్య భవనాల శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గౌరవనీయులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, ప్రభుత్వ విప్ మరియు డోర్నకల్ శాసనసభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, మహిళల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. మహిళా సంఘాలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం కావడానికి ఇలాంటి భవనాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్, కురవి మండల కాంగ్రెస్ అధ్యక్షులు అంబటి వీరభద్రం గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గార్లపాటి వెంకట్ రెడ్డి, టీపీసీసీ డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీరన్న నాయక్, సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, బాలగాని శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ సరూప హరిలాల్, వివిధ గ్రామాల అధ్యక్షులు, మహిళా సంఘాల సభ్యులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ భవనాలు మహిళా సమైక్య సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యకలాపాలకు ఆధునిక వేదికలుగా ఉపయోగపడనున్నాయి. మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధికి ఇవి కీలక పాత్ర పోషించనున్నాయని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ మాట్లాడుతూ, “ప్రతి మహిళా సంఘం సమాజంలోని ప్రతి కుటుంబానికి సుస్థిర మార్గదర్శకంగా నిలవాలి. మహిళల సాధికారత ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుంది” అని అన్నారు. స్థానికులు ఈ శంకుస్థాపన కార్యక్రమం డోర్నకల్ నియోజకవర్గంలో మహిళా సాధికారతకు, గ్రామీణాభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని హర్షం వ్యక్తం చేశారు.

# మరోసారి గ్యాస్ భారం

మొదటిపేజీ తరువాయి

పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరల మధ్య ఈ గ్యాస్ బాదుడు మరింత గందరగోళానికి గురిచేస్తోంది. ఢిల్లీ వంటి మెట్రో నగరాలతో పాటు దేశంలోని ప్రధాన ప్రాంతాలన్నింటిలోనూ సిలిండర్ ధరలు గణనీయంగా పెరిగాయి. దేశ రాజధానిలో ఇప్పటివరకు 913 రూపాయలకే లభించిన సిలిండర్ ధర, తాజా పెంపుతో 942 రూపాయలకు చేరింది. కోల్‌కతాలో ధర 940 నుండి 969 రూపాయలకు, ముంబైలో 913 నుండి 942 రూపాయలకు పెరిగింది. దేశంలోని ప్రధాన నగరాల్లో ఈ పెంపు ఒకేలా ఉండటంతో ఎక్కడికక్కడ వినియోగదారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. రవాణా ఖర్చులు, పన్నులు అన్నీ కలిపి వినియోగదారుడిపై ఇటువంటి అదనపు భారం వేయడం పట్ల తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వ సంస్థలు తీసుకుంటున్న ఈ నిర్ణయాలు సామాన్యుడి కన్నీటిని పెంచుతున్నాయి. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో గ్యాస్ సిలిండర్ ధర వెయ్యి రూపాయల మార్కుకు చేరువవుతోంది. హైదరాబాద్ నగరంలో నిన్నటి వరకు 965 రూపాయలుగా ఉన్న గ్యాస్ ధర, తాజా నిర్ణయంతో 994 రూపాయలకు పెరిగింది. ఒక్క హైదరాబాద్‌లోనే నెలవారీ బడ్జెట్ అంచనాలు అస్తవ్యస్తం కావడంతో కుటుంబ పెద్దలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇదే పరిస్థితి విజయవాడ, విశాఖపట్నం, వరంగల్ వంటి నగరాల్లోనూ కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ లోని గిరిజన ప్రాంతాలు, మారుమూల గ్రామాలు కూడా ఈ ధరల ప్రభావంతో అల్లాడిపోతున్నాయి. వెయ్యి రూపాయలకు కేవలం ఆరు రూపాయల దూరంలో ఉండటంతో త్వరలోనే గ్యాస్ సిలిండర్ ధర ఆ అంకెను దాటేస్తుందనే ఆందోళన సర్వత్రా నెలకొంది. చమురు సంస్థలు అంతర్జాతీయంగా ముడిచమురు ధరల హెచ్చుతగ్గుల నెపంతో గ్యాస్ ధరలను పెంచుతున్నాయి. ఈ మూడు నెలల వ్యవధిని గమనిస్తే, ఫిబ్రవరిలో ఒకసారి, తాజాగా ఇప్పుడు ఒకసారి చొప్పున ధరలు పెరిగాయి. గడిచిన 90 రోజులలోనే సిలిండర్ ధర సుమారు 50 నుండి 60 రూపాయల వరకు పెరిగింది. దీనిని బట్టి చూస్తే ఏడాదికి దాదాపు 240 రూపాయల అదనపు భారం వినియోగదారుడిపై పడుతోంది. పండగలు,



శుభకార్యాల సీజన్ వేళ ఇలా ధరలను పెంచడంపై ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గతంలో సబ్సిడీ రూపంలో కొంత ఉపశమనం లభించేది, ఇప్పుడు ఆ పరిస్థితి కూడా లేకపోవడంతో సామాన్యుడి జేబుకు చిల్లు పడుతోంది. వంటగ్యాస్ ధరల పెంపు ప్రభావం కేవలం సిలిండర్ కొనుగోలుకే పరిమితం కావడం లేదు. హోటళ్లు, క్యాంటీన్లు, చిన్నపాటి టిఫిన్ సెంటర్ల యజమానులు సైతం ఈ భారాన్ని ప్రజలపై వేస్తున్నారు. ఇప్పటికే పెరిగిన కూరగాయలు, నిత్యావసరాల ధరలతో అల్లాడుతున్న సామాన్యుడు, హోటళ్లలో తినే ఆహారంపై కూడా ఎక్కువ ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక కప్పు టీ నుండి పూర్తి భోజనం వరకు అన్ని ధరలు పెరిగే అవకాశం ఉండటంతో ద్రవ్యోల్బణం మళ్లీ పెరిగే ప్రమాదం ఉంది. రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఇప్పటికే ధరలను సవరించే యోచనలో ఉండటంతో ఇది ఒక చక్రబంధంలా మారుతోంది. రోజువారీ కూలీలు, మధ్యతరగతి ఉద్యోగుల కుటుంబాల బడ్జెట్ గణాంకాలు పూర్తిగా తలకిందులవుతున్నాయి. గృహిణుల విషయానికి వస్తే, నెలకు ఒకటి కంటే ఎక్కువ సిలిండర్లు వాడే కుటుంబాలు మరింత ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఉపాధి లేని గృహిణులు, పొదుపు చేసుకునే మహిళలు ధరల పెంపుతో తమ పొదుపు మొత్తాన్ని గ్యాస్ కొనుగోలుకే కేటాయించాల్సి వస్తోంది. నిత్యావసరాల ధరలు పెరిగినప్పుడు పప్పులు, నూనెలు, బియ్యం వంటి వాటిని కొంచెం తక్కువగా వాడుకోవచ్చు, కానీ వంటగ్యాస్ వాడకాన్ని తగ్గించుకోవడం అసాధ్యం. విద్యుత్ బిల్లులు, గ్యాస్ ధరలు ఒకదానిని మించి మరొకటి పెరగడంతో నెలవారీ ఖర్చులు అదుపు తప్పుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ధరల ప్రభావం వల్ల మళ్లీ కట్టెల పొయ్యిల వైపు మొగ్గు చూపే ప్రమాదం ఉందని సామాజిక విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు సబ్సిడీలను క్రమంగా తగ్గిస్తూ ఉండటంతో సామాన్యుడిపై భారం పడుతోంది. ఒకప్పుడు సబ్సిడీ నేరుగా బ్యాంక్ ఖాతాల్లో పడేది, ఇప్పుడు చాలా మందికి ఆ సబ్సిడీ రావడం లేదనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. 994 రూపాయలు ఒకేసారి కట్టడం అంటే సామాన్యుడికి పెద్ద భారమే. వందల రూపాయల సబ్సిడీ కోల్పోయి, వేల రూపాయల భారాన్ని మోయడం వల్ల ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. గ్యాస్ ధరలను తగ్గించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చమురు సంస్థల లాభాల కంటే ప్రజల సంక్షేమమే ముఖ్యమని గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. ధరలను అదుపు చేయకపోతే సామాన్య కుటుంబాల ఉనికి దెబ్బతింటుంది. ఆర్థిక నిపుణుల లెక్కల ప్రకారం, రాబోయే నెలల్లో ఈ ప్రభావం మరింత స్పష్టంగా కనిపించనుంది. ద్రవ్యోల్బణం శాతం పెరగడం వల్ల సామాన్యుల కొనుగోలు శక్తి తగ్గుతుంది. మార్కెట్లో వస్తువుల ధరలు పెరగడం వల్ల ఆర్థిక వ్యవస్థ మందగించే అవకాశం ఉంది. ఆదాయం స్థిరంగా ఉన్నా, ఖర్చులు పెరుగుతున్నందున మధ్యతరగతి ప్రజలు అప్పుల వైపు అడుగులు వేయాల్సి వస్తోంది. గ్యాస్ ధరల పెంపు అనేది ఒక సూచిక మాత్రమే, దీని వెనుక ఉన్న ఆర్థిక వ్యూహాలు సామాన్యుడికి అర్థం కావడం లేదు. ధరల పెంపును కట్టడి చేసేందుకు కేంద్రం తీసుకునే చర్యలే భవిష్యత్ ఆర్థిక పరిస్థితిని నిర్ణయిస్తాయి. ధరల పెంపును నిరసిస్తూ వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు నిరసనలకు సిద్ధమవుతున్నాయి. నిత్యావసరాల పైన ఉన్న పన్నులను తగ్గించాలని, సబ్సిడీలను మళ్ళీ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రజల కష్టాలను గుర్తించి ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతున్నాయి. గ్యాస్ ధరల విషయంలో ఒక స్పష్టమైన విధానం లేకపోవడం వల్లనే ఇటువంటి అస్థిరత నెలకొంటోంది. ఒకే దేశంలో వేర్వేరు నగరాల్లో వేర్వేరు ధరలు ఉండటం కూడా అశాస్త్రీయమని ప్రజలు భావిస్తున్నారు. ప్రభుత్వాలు సామాన్యుడికి భరోసా ఇచ్చేలా ధరల నియంత్రణ మండలిని ఏర్పాటు చేయాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. మొత్తంగా చూస్తే, వంటగ్యాస్ ధరల పెంపు సామాన్య కుటుంబాల మెడకు చుట్టుకున్న ఉచ్చులా మారుతోంది.

# ఉచిత వైద్యం ఇవ్వకపోతే రాళ్లతో కొట్టండి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాజకీయ క్రీడలో ఫిక్సింగ్ పర్వాలకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గర్జించారు. సంగారెడ్డి గడ్డపై పార్టీ జెండాను రెపరెపలాడించిన ఆమె, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అధికార పీఠాన్ని అధిరోహించడం ఖాయమని తేల్చిచెప్పారు. కల్వకుంట్ల కవిత ప్రతిపాదించిన పంచసూత్రాల అజెండా ప్రజల్లోకి బలంగా వెళ్తోంది. అధికారంలోకి రాగానే ఉచిత విద్యుత్, వైద్యం అందించడంలో విఫలమైతే తనను తెల్లపూర్ శివారులో బంధించి దండించాలని సవాల్ విసిరారు. రాష్ట్ర భవితవ్యాన్ని మార్చగల సత్తా తమ పార్టీకి ఉందని, స్వార్థ రాజకీయాలకు తాము స్వస్తి పలుకుతామని స్పష్టం చేశారు. జిల్లా రాజకీయాల్లో సాగుతున్న తెర వెనుక బాగోతాలను ఆమె ఎండగట్టారు. సింగూర్ ప్రాజెక్టు పరిధిలో దాదాపు 200 ఎకరాల భూమి అన్యాక్రాంతమైందని, దీనిపై అధికార ప్రతిపక్ష నేతలు మౌనం వహించడం వెనుక మతలబు ఏంటని నిలదీశారు. స్థానిక నాయకులైన జగ్గారెడ్డి, రఘునందన్ రావు, దామోదర రాజనర్సింహ, హరీశ్ రావు మధ్య జరుగుతున్న అలిఖిత ఒప్పందాలు సంగారెడ్డి ప్రజల ప్రగతిని అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలతో జిల్లాను బందీని చేస్తున్న వీరికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై గళం విప్పాల్సిన ప్రతిపక్షాలు కేవలం తమ స్వలాభం కోసం పని చేస్తున్నాయని విమర్శించారు. జహీరాబాద్ బులెట్ ట్రైన్ ప్రాజెక్టు విషయంలో ఎంపీ రఘునందన్ రావు పాత్రను ఆమె శోధించారు. డీపీఆర్ మార్పు ద్వారా ప్రాజెక్టును నీరుగార్చినా సదరు ఎంపీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో ఇరిగేషన్ మంత్రిగా పనిచేసిన హరీశ్ రావు, సింగూర్ ప్రాజెక్టు దుస్థితిని చూసి కూడా పట్టించుకోకపోవడం దారుణమని ఆరోపించారు. 2016 నుండి 2018 మధ్య కాలంలో ఈ ప్రాజెక్టు పూర్తిగా ఎండిపోయి అడవిని తలపించినా, ఒక్క రూపాయి నిధులు విడుదల చేయలేదని గణాంకాలతో సహా వివరించారు. తెలంగాణ వస్తే ప్రాజెక్టులకు మహర్దశ పడుతుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పక్షం ప్రలోభాలకు, ప్రతిపక్షాల మౌనానికి మధ్య నలిగిపోతున్న సామాన్యుడిని ఆదుకోవడమే తమ ధ్యేయమని ప్రకటించారు. పాంచజన్యం పేరుతో ఐదు కీలక అంశాలను ప్రజల ముందు



ఉంచారు. ముఖ్యంగా రైతు కల్లాల వద్ద గుండెపోటుతో మరణిస్తున్న అన్నదాతల కన్నీరు తుడవడానికి ఏ పార్టీ ముందుకు రావడం లేదని వాపోయారు. కష్టాల్లో ఉన్న రైతును గౌరవించే జవాబుదారీ ప్రభుత్వం తమదని, రైతు కన్నీరు పెట్టని సామాజిక న్యాయ తెలంగాణను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రైతుల కోసం తాము ఏ స్థాయి పోరాటానికైనా సిద్ధమని ప్రకటించారు. తెలంగాణ యువత ఆశలను నెరవేర్చేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించారు. స్వయం ఉపాధి కల్పించేందుకు 2 లక్షల రూపాయల నుంచి 20 కోట్ల రూపాయల వరకు రుణాలు అందిస్తామని హామీ ఇచ్చారు. నేడు యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్న పరిస్థితిని చూస్తుంటే బాధగా ఉందని పేర్కొన్నారు. గల్లీ రాజకీయాలతో యువత భవితవ్యాన్ని ఆడుకోవడం మానేసి, వారికి భరోసానిచ్చే పథకాలను తాము అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అన్ని వర్గాలకు రాజకీయ అవకాశాలు వస్తాయని ప్రజలు భావించినా, అది కలగానే మిగిలిపోయిందని విశ్లేషించారు. రాజకీయ అధికారంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదని వాపోయారు. తమ ప్రభుత్వంలో ఈ వర్గాలకు పెద్దపీట వేస్తామని, సామాజిక న్యాయాన్ని పాటిస్తూ అసలైన తెలంగాణను నిర్మిస్తామని కవిత భరోసా ఇచ్చారు. కులమతాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. సమతుల్య అభివృద్ధి ద్వారా రాష్ట్రంలోని ప్రతి మూలకు ప్రగతిని చేరుస్తామని పేర్కొన్నారు. సింగూర్ ప్రాజెక్టును మళ్లీ పూర్వవైభవానికి తీసుకురావడానికి తాము ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. గతంలో ఆంధ్రా పాలకులను నిందించిన నాయకులు, ఇప్పుడు అధికారంలో ఉండి కూడా రిపేర్లు ఎందుకు చేయడం లేదని హరీశ్ రావును ఉద్దేశించి ప్రశ్నించారు. 2018 నాటి పరిస్థితులను మళ్లీ రాకుండా నివారించడంలో విఫలమైన వారికి అధికారంలో ఉండే అర్హత లేదని స్పష్టం చేశారు. జిల్లా అభివృద్ధిని అడ్డుకుంటున్న శక్తులను సంగారెడ్డి ప్రజలు ఓడించాలని ఆమె కోరారు. తాము అధికారంలోకి రాగానే ప్రాజెక్టు పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపడతామని హామీ ఇచ్చారు. రాజకీయాల్లో ఫిక్సింగ్ సంస్కృతిని అంతం చేయడమే తమ మొదటి లక్ష్యమని కవిత ప్రకటించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో అన్ని పార్టీల నాయకులు ఒకే తాటిపై ఉండి ప్రజలను మోసం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. అభివృద్ధి పేరుతో దోపిడీకి పాల్పడుతున్న వీరిని గద్దె దించాల్సిన సమయం వచ్చిందని అన్నారు. పార్టీలకతీతంగా ప్రజలందరూ ఏకం కావాలని, రక్షణ సేన పార్టీని బలోపేతం చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో రక్షణ సేన పార్టీకి ఇచ్చే ఒక్కో ఓటు జిల్లా భవితవ్యాన్ని మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లోనూ రక్షణ సేన పార్టీ బలంగా పుంజుకుంటోందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తాము ఎప్పుడూ వెనకడుగు వేయమని, తన ప్రాణాలను పణంగా పెట్టినా ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తానని ఆమె అన్నారు. విమర్శలను లెక్కచేయకుండా లక్ష్యం వైపు ప్రయాణిస్తున్నామని చెప్పారు. 10 ఏళ్ల పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పాలని అధికార పక్షాన్ని నిలదీశారు. రాబోయే ఎన్నికల్లో మార్పు కోరుకునే వారంతా తమ వైపు రావాలని ఆహ్వానించారు. సంగారెడ్డి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పిస్తే జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కవిత పేర్కొన్నారు. నేడు రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ డ్రామాలకు తెరదించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని అన్నారు. కష్టపడే రైతుకు, చదువుకున్న యువతకు, బడుగు బలహీన వర్గాలకు ఈ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆమె పునరుద్ఘాటించారు. రాజకీయ ఫిక్సింగ్‌కు స్వస్తి చెప్పి, ప్రజాస్వామ్య బద్ధమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు రక్షణ సేన పార్టీకి మద్దతు ఇవ్వాలని ఆమె కోరుతూ ప్రసంగాన్ని ముగించారు.

# ముంచుకొస్తున్న కూరగాయల ముప్పు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

వంటగదిలో గందరగోళం మొదలైంది. వంద రూపాయల నోటు చేత పట్టుకుని సంతకు వెళ్తే సంచీ నిండా కూరగాయలు వచ్చే రోజులు గతించాయి. నేడు అదే వంద రూపాయలకు రెండు మూడు రకాల కూరగాయలు కూడా దొరకని దయనీయ స్థితి నెలకొంది. కొత్తిమీర కట్ట పది పదిహేను రూపాయల తక్కువకు లభించని దుస్థితిలో సామాన్యుడు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. వంకాయ, బీరకాయ, టమాటా ధరలు నింగిని తాకుతున్నాయి. అల్లం, వెల్లుల్లి ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉంటున్నాయి. రాబోయే కాలంలో ఈ ధరల మంట మరింత పెరిగే అవకాశం ఉండగా, సప్లయ్ భారీగా తగ్గిపోయే ప్రమాదం పొంచి ఉంది. రాష్ట్రంలో కూరగాయల సాగు పడిపోవడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణం. పన్నెండేళ్ల క్రితం 5.5 లక్షల ఎకరాల్లో సాగైన కూరగాయలు ఇప్పుడు కేవలం 50 వేల ఎకరాలకు పడిపోయాయి. తెలంగాణ ప్రజల అవసరాలు ఏటా 56 లక్షల టన్నుల కూరగాయలు కాగా, ఇక్కడ పండుతున్న దిగుబడి 10 లక్షల టన్నుల లోపే ఉంది. అంటే మిగిలిన 46 లక్షల టన్నుల కూరగాయల కోసం ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన గతి పట్టింది. కొత్తిమీర వంటి అత్యవసర ఆకుకూరను కూడా గుజరాత్ నుంచి దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఉత్తరాది రాష్ట్రాల్లో ఎల్నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉండటంతో అక్కడ దిగుబడి తగ్గి, మనకు అందే సప్లయ్ నిలిచిపోవచ్చు. తద్వారా ధరలు అమాంతం పెరిగే ప్రమాదం ఉంది. స్థానికంగానే సాగును పెంచడం ద్వారా మాత్రమే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వ్యవసాయ శాఖ స్పష్టం చేస్తోంది. సొంత రాష్ట్రం ఏర్పడితే నీళ్లు, నిధులు, కొలువులు లభిస్తాయని ఆశించిన ప్రజలకు, కూరగాయల స్వయంసమృద్ధి విషయంలో నిరాశే ఎదురైంది. పాలకుల నిర్లక్ష్యం, రైతుల అవగాహన



లోపం వెరసి కూరగాయల సాగును పక్కకు నెట్టేశాయి. గతంలోనే ఇతర రాష్ట్రాల నుంచి లారీల్లో వచ్చే కూరగాయలు ఇప్పుడు కూడా అదే రీతిలో దిగుమతి అవుతున్నాయి. వరి, మొక్కజొన్న, ఆయిల్ పామ్ తప్ప ఇతర పంటలపై శ్రద్ధ తగ్గింది. పన్నెండేళ్ల క్రితం 5.5 లక్షల ఎకరాల్లో సాగు ఉండగా, ఇప్పుడు కేవలం 50 వేల ఎకరాలకే పరిమితమైంది. స్వయంసమృద్ధి సాధించాల్సిన రాష్ట్రం దిగుమతులపై ఆధారపడటం ఒక విచిత్రమైన పరిస్థితిని సృష్టించింది. మదనపల్లి, చింతపల్లి నుంచి టమాటా, దొండకాయలు, బెండకాయలు వస్తున్నాయి. క్యారెట్, కాలీఫ్లవర్, క్యాబేజీ, బీన్స్, కాప్సికమ్ వంటివి కర్ణాటక నుంచి తరలివస్తున్నాయి. ఆలుగడ్డ, ఉల్లిగడ్డ, అల్లం, వెల్లుల్లి మహారాష్ట్ర నుంచి లారీల్లో వస్తున్నాయి. ప్రతీరోజూ వంటగదిలో వాడే నిత్యావసరాల కోసం ఇతర రాష్ట్రాలకు ఎదురుచూడటం తప్పనిసరి అయింది. కొత్తిమీరను గుజరాత్ నుంచి తెప్పించుకుంటున్నామన్న వ్యవసాయ కమిషన్ సభ్యుడి మాటలు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. దశాబ్ద కాలంలో వరి, పత్తి, మిరప వంటి వాణిజ్య పంటలకే రైతులు మొగ్గు చూపగా, కూరగాయల సాగు నామమాత్రంగా మారింది. హైదరాబాద్ చుట్టుపక్కల ఒకప్పుడు వెలిసిన ద్రాక్ష తోటలు ఇప్పుడు మాయమయ్యాయి. రాష్ట్రం ఏర్పడే నాటికి వరి సాగు 50 లక్షల ఎకరాలు ఉంటే, ఇప్పుడు అది కోటింబావు ఎకరాలకు పెరిగింది. కూరగాయల సాగు 5.5 లక్షల నుంచి 50 వేల ఎకరాలకు పడిపోయింది. పసుపు బోర్డు కోసం నిజామాబాద్ లో పోరాటం చేసినా, దాని సాగు లక్షన్నర ఎకరాల నుంచి 42 వేల ఎకరాలకు పడిపోయింది. చెరకు సాగు లక్ష ఎకరాల నుంచి రెండు వేల ఎకరాలకు కుంచించుకుపోయింది. పండ్ల తోటలు 9 లక్షల ఎకరాల నుంచి 4.5 లక్షలకు సగానికి తగ్గాయి. పూల సాగు 17 వేల ఎకరాల నుంచి 6 వేలకు పడిపోయింది. గత సర్కారు హార్టికల్చర్ మీద శ్రద్ధ పెట్టకపోవడం దీనికి ప్రధాన కారణం. గ్రీన్ హౌజ్, పాలీ హౌజ్ అంటూ చేసిన ప్రకటనలు అర్ధంతరంగా ఆగిపోయాయి. వ్యవసాయ కమిషన్ చేసిన అధ్యయనంలో సాగు తగ్గుదల వెనుక అనేక ఇబ్బందులు ఉన్నట్లు గుర్తించింది. గిట్టుబాటు ధరలు లేకపోవడం, మార్కెటింగ్ సదుపాయాల లోపం రైతులను కూరగాయల సాగుకు దూరం చేశాయి.

# నీ సంగతి చూస్తా కిషన్ రెడ్డి

- మూసీ ప్రక్షాళనకు అడ్డంకిగా కిషన్ రెడ్డి
- పర్యాటక కేంద్రంగా మార్చడమే లక్ష్యం
- అనుమతులు, నిధుల విషయంలో కిషన్ రెడ్డి అడ్డు
- కేంద్రం సహకరించకపోతే పోరాటం చేస్తాం
- మల్కాజ్‌గిరిలో రూ. 1,511 కోట్ల అభివృద్ధి పనులు
- భారీ ఫ్లై ఓవర్లతో ట్రాఫిక్ సమస్యలకు చెక్
- అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



హైదరాబాద్ నగరం నడిబొడ్డున పారుతున్న మూసీ నదిని అంతర్జాతీయ స్థాయిలో ప్రక్షాళన చేసి, దానిని సుందరమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మల్కాజ్‌గిరి పార్లమెంటు పరిధిలోని ఉప్పల్ ప్రాంతంలో ఏకంగా 1,511 కోట్ల రూపాయల విలువైన భారీ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఆయన, అనంతరం జరిగిన బహిరంగ సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్, ఉత్తరప్రదేశ్‌లో గంగా నది తీరం, ఢిల్లీలో యమునా నది ప్రక్షాళన ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినప్పుడు, తెలంగాణ రాజధానిలో మూసీ ప్రక్షాళన ఎందుకు చేయకూడదని ఆయన కేంద్రాన్ని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టును రాజకీయ కోణంలో చూడకుండా నగరం బాగు కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు సుమారు 55 కిలోమీటర్ల మేర మూసీ నదిని అభివృద్ధి చేస్తే, లక్షలాది మంది యువతకు ఉపాధి లభించడమే కాకుండా, హైదరాబాద్ ప్రపంచ పర్యాటక చిత్రపటంలో సమున్నత స్థానంలో నిలుస్తుందని రేవంత్ రెడ్డి వివరించారు. దశాబ్దాలుగా మూసీ మురికిగా ఉండటం వల్లనే చుట్టుపక్కల ప్రాంతాల్లో భూముల ధరలు పెరగడం లేదని, నల్లగొండ జిల్లా ప్రజలు ఈ కలుషిత నీటి వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలుషితం కారణంగా అక్కడి ఆడబిడ్డలు తీవ్రమైన కడుపుకోతకు గురవుతున్నారని, ఆ ప్రాంత ప్రజలు తమ పిల్లలను బయటకు పంపేందుకు భయపడుతున్నారని ఆయన ఆవేదన చెందారు. మూసీ బాధితులకు మెరుగైన ఇళ్లు కట్టిస్తామని, వారి పిల్లలకు నాణ్యమైన చదువు అందిస్తామని ప్రభుత్వం చెబుతున్నా, కొందరు అడ్డుపడుతుండటం దురదృష్టకరమని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ మూసీ ప్రక్షాళనకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని ముఖ్యమంత్రి తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు విస్తరణ పనులకు అన్ని రకాల అనుమతులు వచ్చినా, కిషన్ రెడ్డి కాళ్లలో కట్టెలు పెట్టి ఆపుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన రెండున్నర ఏళ్ల కాలంలో రీజనల్ రింగ్ రోడ్డు పనుల కోసం తాను ఏకంగా 50 సార్లు ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రిని కలిశానని గుర్తుచేశారు. మెట్రో విస్తరణకు కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు కోసం నిధులు తీసుకురావాల్సిన కనీస బాధ్యత కిషన్ రెడ్డికి లేదా అని రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని, మిగిలిన 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాల్సిన బాధ్యత కేంద్రానిదేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్రంతో ధాన్యం కొనుగోలు చేయించే బాధ్యతను కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి తీసుకోవాలని, లేదంటే ప్రజలు క్షమించరని హెచ్చరించారు. భారతీయ జనతా పార్టీలో ఉంటూ ఇతర రాజకీయ పార్టీల సహకారం తీసుకోవడం కిషన్ రెడ్డికి తగదని, అభివృద్ధి గురించి మాట్లాడకుండా రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రజలతో పెట్టుకున్న ఏ నాయకుడు బాగుపడలేదని, ఈ నెల 15 తర్వాత కిషన్ రెడ్డి సంగతి చూస్తామని హెచ్చరిక జారీ చేశారు. తుమ్మిడి హట్టి బ్యారేజ్ నిర్మాణ అంశంపై చర్చించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ముందుకు రాకుండా తప్పించుకుంటున్నారని, దీనికి కూడా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వైఖరే కారణమని సీఎం ఆరోపణలు చేశారు. రాజకీయాలకు అతీతంగా హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. నాగోల్ నుంచి గౌరెల్లి వరకు ఫేజ్ 2 లో భాగంగా మూసీ ప్రక్షాళన పనులను చేపడతామని, రాబోయే 100 రోజుల్లోనే ఈ ప్రాజెక్టు కార్యాచరణ మొదలవుతుందని ఆయన హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల విషయంలో కిషన్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే, తనను కేంద్ర మంత్రుల వద్దకు తీసుకువెళ్లి అనుమతులు ఇప్పించాలని సవాల్ విసిరారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భారీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి, 1,511 కోట్ల రూపాయల విలువైన పనులతో స్థానిక ప్రజల కష్టాలను తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇందులో ప్రధానంగా సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో 98 కోట్ల రూపాయల భారీ వ్యయంతో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. నగరం నలుమూలల నుంచి వచ్చే ప్రయాణికుల కోసం ఏఓసి సెంటర్ వద్ద 960 కోట్ల రూపాయలతో ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టడం వల్ల ట్రాఫిక్ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ వైపు వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు టీకేఆర్ కాలేజ్ జంక్షన్ వద్ద 416 కోట్ల రూపాయల భారీ నిధులతో 6 లేన్ల ఫ్లై ఓవర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణం పూర్తయితే ప్రయాణ సమయం గంటల నుంచి నిమిషాలకు మారుతుందని, కాలుష్యం కూడా తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత, నాణ్యమైన వైద్యం అందించేందుకు 37.50 కోట్ల రూపాయల వ్యయంతో 100 పడకల సామర్థ్యంతో మల్కాజ్‌గిరి జిల్లా ఆస్పత్రి భవనాన్ని నిర్మిస్తున్నామని ఆయన వెల్లడించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ట్రాఫిక్ రహిత నగరంగా మార్చేందుకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని, అందులో భాగంగానే వందల కోట్ల రూపాయలతో ఫ్లై ఓవర్లు, అండర్ పాస్లు నిర్మిస్తున్నామని రేవంత్ రెడ్డి వివరించారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఆధునిక విద్య కోసం పాఠశాలలు, ఆరోగ్యం కోసం ఆస్పత్రులు నిర్మించడం ద్వారా సామాన్య ప్రజల జీవన ప్రమాణాలను పెంచుతామని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నామని ఆయన గుర్తుచేశారు. అభివృద్ధి పనుల కోసం తీసుకుంటున్న ఈ నిర్ణయాలు నగరం భవిష్యత్తును నిర్ణయిస్తాయని, ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఏ ప్రాంతం కూడా వెనుకబడకుండా సమానంగా నిధులు కేటాయిస్తూ, అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా ప్రణాళికలు రూపొందించామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ అభివృద్ధికి తాను వ్యక్తిగతంగా శ్రద్ధ వహిస్తానని, పెండింగ్‌లో ఉన్న ప్రతి పనిని పూర్తి చేస్తానని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజాధనాన్ని పారదర్శకంగా ఖర్చు చేస్తూ, నాణ్యమైన నిర్మాణాలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. హైదరాబాద్ నగరాన్ని విశ్వ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ప్రతి పౌరుడు మద్దతు తెలపాలని రేవంత్ రెడ్డి కోరారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన జీవన సౌకర్యాలు కల్పించడమే తన బాధ్యత అని, అందుకు అనుగుణంగానే వందల కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించామని తెలిపారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, అనుమతులను సాధించేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, ప్రజల హక్కుల కోసం ఎవరినైనా ఎదిరించేందుకు వెనకాడనని ఆయన పునరుద్ఘాటించారు. నగరం ప్రగతి, పేద ప్రజల కళ్లలో ఆనందం చూసే వరకు ప్రభుత్వం విశ్రమించదని ఆయన నొక్కి చెప్పారు.

# రేవంత్‌కి 'హిట్లర్' దెబ్బ!

**మొదటిపేజీ తరువాయి**

'హైడ్రా' వ్యవస్థను ఏర్పాటు చేశానని రేవంత్ రెడ్డి బహిరంగంగానే పేర్కొనడం ప్రతిపక్షాలకు పెద్ద ఆయుధంగా మారింది. హిట్లర్ ఫేవరెట్ పదమైన హైడ్రాను, ఎవరినైనా అంతం చేయగల సామర్థ్యం కలిగిన టీమ్ పేరుతో తాను పోల్చుకోవడం గర్వకారణమని ఆయన భావించారు. ఆక్రమణల విషయంలో ఎవరికీ లొంగకుండా పని పూర్తి చేయడమే లక్ష్యమంటూ హైడ్రాకు హైప్ ఇచ్చే ప్రయత్నం చేశారు. కానీ గతంలో ఇదే హైడ్రా కూల్చివేతలను భగవద్గీత స్ఫూర్తితో, దుష్టశిక్షణశిష్టరక్షణ లక్ష్యంగా చేస్తున్నామని చెప్పిన రేవంత్, ఇప్పుడు హిట్లర్ పేరును తెరపైకి తీసుకురావడంతో ఆయనకే స్పష్టత లేదన్న విమర్శలు మొదలయ్యాయి. హైడ్రా ఏర్పాటు, పనితీరుపై మొదటి నుంచి హైదరాబాద్ వాసుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ప్రభుత్వ భూములు, పార్కులు, చెరువులు, కుంటలు, నాలాలు ఆక్రమణకు గురికాకుండా కూల్చివేతలు చేస్తున్నామన్న ప్రభుత్వ వాదనను మధ్య తరగతి, పేద ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ముఖ్యంగా కూల్చివేతలు కేవలం పేదోళ్లకే పరిమితమై, మంత్రులు, ప్రజాప్రతినిధులు, బడా బిల్డర్ల జోలికి వెళ్లకపోవడమే ఈ వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణలో ఉన్నా, బడా రాజకీయ నాయకుల ఫాంహౌస్‌లు, విల్లాలు మాత్రం సురక్షితంగా ఉండటంపై విపక్షాలు నిలదీస్తున్నాయి. మూసీ బఫర్ జోన్ లోని ఆదిత్య బిల్డర్స్ వంటి భారీ నిర్మాణాలపై ఎందుకు చర్యలు లేవని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తుండటంతో హైడ్రా చర్యల్లో పారదర్శకత లోపించిందన్నది సుస్పష్టం. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తున్నామని చెప్పుకుంటున్న వేళ, హిట్లర్ ప్రస్తావన తెరపైకి రావడం ఆ పార్టీని రక్షణాత్మక ధోరణిలోకి నెట్టింది. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల వేళ ఈ వ్యాఖ్యలు ఎలా పరిణమిస్తాయోనన్న ఆందోళన కాంగ్రెస్ నేతల్లో మొదలైంది. లక్షల మందిని బలి తీసుకున్న అడాల్ఫ్ హిట్లర్ కు వారసుడిలా వ్యవహరిస్తూ, వేలాది పేదల గూళ్లు కూల్చి వారి బతుకులను రోడ్డున పడేస్తున్న నయా హిట్లర్ రేవంత్ రెడ్డి అంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియాలో ముప్పేట దాడి సాగిస్తోంది. నిరాశ్రయులైన ఆ పేదల కన్నీళ్లు శాపంగా మారతాయని, చరిత్రలో దుర్మార్గ పాలకులుగా మిగిలిపోవడం ఖాయమని వారు విమర్శిస్తున్నారు. హిట్లర్ స్ఫూర్తి వ్యాఖ్యలతో ప్రజాపాలన అనే ముసుగు పూర్తిగా తొలగిపోయిందని బీఆర్ఎస్ ఫైర్ అవుతోంది. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సైతం ఈ వ్యాఖ్యలను ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమైన ఎమర్జెన్సీ ధోరణిగా అభివర్ణించారు. హిట్లర్ తరహా నియంతృత్వ వైఖరిని ప్రదర్శిస్తున్న రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ లో చేపట్టిన కూల్చివేతలను ఇరాన్, ఇజ్రాయెల్ వంటి యుద్ధగ్రస్త దేశాలతో పోల్చడం ద్వారా తన నాయకుడు రాహుల్ గాంధీ భాషనే అనుసరిస్తున్నారని ఆయన విమర్శించారు. ఎమర్జెన్సీ కాలం నుంచి హిట్లర్ తరహా ధోరణి వరకు కాంగ్రెస్ ఎప్పుడూ ప్రజల గొంతు నొక్కే ప్రయత్నమే చేస్తోందని, ఇటువంటి మాటలు సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. గతంలో కేసీఆర్ తన ప్రభుత్వంలో ధరణి పోర్టల్, కాళేశ్వరం ప్రాజెక్టు, డబుల్ బెడ్రూమ్ వంటి అంశాలపై ఎంత మొండిగా వ్యవహరించారో, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా హైడ్రా, మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ విషయంలో అంతే మొండిగా ముందుకెళ్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకప్పుడు కేసీఆర్ తాను హిట్లర్ కంటే ఎక్కువ టెర్రిఫిక్ అని, అవసరమైతే హిట్లర్ తాతలా వ్యవహరిస్తానని చేసిన వ్యాఖ్యలు, నేడు రేవంత్ రెడ్డి హిట్లర్ స్ఫూర్తి అని చెప్పడం ఒకే నాణేనికి ఉన్న రెండు పార్శ్వాల వంటివి. అహంకారపు వైరస్ ఒకరు వదిలిన చోట, మరొకరికి సోకినట్లుగా కనిపిస్తుంది. కేసీఆర్ అహంభావం, నియంత వైఖరిని ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి అనుసరించడం రాష్ట్ర రాజకీయాల్లో దురదృష్టకరమని మేధావులు పేర్కొంటున్నారు. అధికార అహంకారం అనే వైరస్, కేసీఆర్ ను ఆవహించిన తీరుగానే, నేడు రేవంత్ రెడ్డికి కూడా సోకిందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ప్రధాన మంత్రి మోదీపై ఘాటైన విమర్శలు చేయడం, కేంద్ర మంత్రులను, ఎంపీలను పొలిమేర దాటనివ్వబోమని వ్యాఖ్యానించడం కేసీఆర్ అనుసరించిన ఘర్షణాత్మక రాజకీయ బాటనే గుర్తు చేస్తోంది. వచ్చే 2034 వరకు తానే ముఖ్యమంత్రిని, రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తానంటూ రేవంత్ చేస్తున్న డైలాగులు అహంకారానికి పరాకాష్ట అని ప్రజలు భావిస్తున్నారు. కేసీఆర్ తనను అందలం ఎక్కించిన తెలంగాణ సెంటిమెంట్‌ను నిర్లక్ష్యం చేసి, చివరికి బీఆర్ఎస్ ను సున్నా స్థానాలకు పడిపోయేలా చేసుకున్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలి. కేంద్రంతో నిరంతరం ఘర్షణకు దిగడం వల్ల తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన సహకారం ఆగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ధాన్యం కొనుగోలు, ఆర్ఆర్ఆర్ రహదారి నిధులు, మెట్రో విస్తరణ అనుమతులు, వరంగల్ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుల నిర్మాణం, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు జాతీయ హోదా వంటి 10 కీలక ప్రాజెక్టులు కేంద్రంతో ముడిపడి ఉన్నాయి. సరైన రాజనీతిని ప్రదర్శించకుండా, కేంద్రంపై అనవసర విమర్శలు చేయడం వల్ల కార్యాచరణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. గతంలో కేసీఆర్, ఇప్పుడు రేవంత్ అనుసరిస్తున్న ఈ వైఖరి రాష్ట్ర అభివృద్ధికి నష్టదాయకమని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంగా మారిందని, ఎన్నికల్లో ఆర్థిక ఇంధనంగా వాడుకుంటున్నారన్న భావన బీజేపీలో బలంగా ఉంది. ఒకవైపు ఉత్తరాది, దక్షిణాది విభజన వ్యాఖ్యలు, మరోవైపు రాజ్యాంగ మార్పుపై విమర్శలు, డీలిమిటేషన్ ను వ్యతిరేకించడం వంటి విషయాల్లో రేవంత్ వ్యవహారశైలి కేంద్ర ప్రభుత్వంతో వైరాన్ని పెంచుతోంది. రాజకీయం వేరని, పాలన వేరని గుర్తించకుండా నిత్యం యుద్ధానికి సై అంటూ రెచ్చగొట్టడం రాష్ట్రానికి అపార నష్టాన్ని కలిగిస్తోంది. కేంద్ర సహకారం లేకుండా పారిశ్రామిక, సాగునీటి రంగాల్లో పురోగతి అసాధ్యమని, రేవంత్ రెడ్డి పంతాలకు పోయి తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెడుతున్నారన్న చర్చ సర్వత్రా సాగుతోంది. రేవంత్ రెడ్డి తీరు చూస్తుంటే నియంతృత్వ వైఖరి నుంచి బయటపడి, ప్రజాస్వామ్యబద్ధమైన పాలనకు ప్రాధాన్యత ఇస్తారా లేదా అన్న అనుమానాలు ప్రజల్లో బలపడుతున్నాయి. హిట్లర్ వంటి నియంతల స్ఫూర్తిని బహిరంగంగా ప్రకటించడం కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీకి ఏమాత్రం శోభించదు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తే, భవిష్యత్తులో కేసీఆర్ కు పట్టిన గతే రేవంత్ రెడ్డికి పడుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. కేంద్రంతో ఘర్షణను వీడి, రాష్ట్ర అభివృద్ధికి సహకరించే రాజనీతిని ప్రదర్శిస్తేనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుంది. అహంకారపు వైరస్ నుంచి బయటపడి, ప్రజాహిత పాలన అందించడమే రేవంత్ రెడ్డి ముందున్న ఏకైక మార్గం.



# నరరూప రాక్షసుడు నీకు రోల్ మోడలా?

**మొదటిపేజీ తరువాయి**

నరమేధం సృష్టించిన హిట్లర్ ఆదర్శమని చెప్పడానికి అసలు సిగ్గు అనిపించడం లేదా అని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం ఎక్స్ వేదికగా ఈ ఆరోపణలు చేస్తూ, ముఖ్యమంత్రి వైఖరిపై నిప్పులు చెరిగారు. అధికారంలో ఉన్న నాయకుడు నియంతను కీర్తించడం ప్రజాస్వామ్య వ్యవస్థకే మాయని మచ్చ అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదాస్పద వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. మొన్న ప్రజా పాలన అని ఊదరగొట్టిన రేవంత్, నిన్న ఇందిరమ్మ పాలన అంటూ గొప్పలు చెప్పుకుని, నేడు హిట్లర్ పాలన అని తన నోటితోనే అంగీకరించారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గడిచిన రెండున్నరేళ్ల రేవంత్ రాక్షస పాలనలో ఆనవాళ్లు నిజంగానే హిట్లర్ అరాచకాలను తలపిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రపంచ చరిత్రలో యుద్ధాలు మిగిల్చిన విషాదాల కంటే రేవంత్ పాలనలో పేదలు పడుతున్న వేదన మిన్నగా ఉందని ఆయన పేర్కొన్నారు. హైడ్రా కూల్చివేతల నుంచి మూసీ ప్రక్షాళన వరకు, లగచర్ల బాధితుల నుంచి వెలుగుమట్ల బాధల వరకు ప్రభుత్వం ప్రదర్శిస్తున్న తీరు నయా నాజీ పాలనకు నిజమైన సాక్ష్యాలని కేటీఆర్ ఘాటుగా విమర్శించారు. పేదలపై విరుచుకుపడుతున్న ప్రభుత్వ బుల్డోజర్లు నియంతృత్వానికి ప్రతీకలని ఆయన మండిపడ్డారు. పదేళ్ల పాటు సంతోషంగా ఉన్న తెలంగాణను కేవలం రెండున్నరేళ్ల కాలంలోనే సంక్షోభాల పాతాళంలోకి నెట్టేసినప్పుడే ముఖ్యమంత్రి నియంత పోకడలు స్పష్టంగా బయటపడ్డాయని ఆయన గుర్తు చేశారు. విధ్వంసమే విధానంగా, వికాసం అంటే తెలియని అజ్ఞానంతో పాలన సాగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇంత నిర్లజ్జగా నియంతను ఆరాధించే మనస్తత్వం కలిగి ఉండటం, ఆ వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రిగా కొనసాగడం రాజ్యాంగ వ్యవస్థకే అత్యంత ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. ప్రజాస్వామ్య దేశంలో ఒక నియంతను నిలువెత్తు కీర్తించే దుర్మార్గమైన మనస్తత్వం స్వతంత్ర భారతావనిలోనే ఒక చీకటి అధ్యాయమని కేటీఆర్ అభివర్ణించారు. పరిపాలనలో ఉన్నత విలువలు పాటించాల్సిన స్థానంలో ఉండి, చరిత్రహీనులను కీర్తించడం అనాగరికమని ఆయన దుయ్యబట్టారు. ఈ వీరోచిత పోరాటాల పురిటిగడ్డ అయిన తెలంగాణలో ఎందరో నియంతలకు నూకలు చెల్లిన చరిత్ర ఉందని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ గ్రామగ్రామాన లేచిన ఉక్కు పిడికిళ్లు గతంలో పాలకులను రాష్ట్ర పొలిమేరల దాకా తరిమికొట్టిన ఉదంతాలను ఆయన ఉటంకించారు. తలకెక్కిన అధికారంతో విర్రవీగిన హిట్లర్‌కు ఆనాడు ప్రపంచవ్యాప్తంగా ఏ గతి పట్టిందో, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తీర్పుతో అదే గతి పట్టడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. హిట్లర్ వారసుడి చేతిలో చిక్కిన రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు గులాబీ జెండా నేతృత్వంలోనే మరో విముక్తి పోరాటం సాగడం తథ్యమని ఆయన ప్రకటించారు. హిట్లర్ హటావో, తెలంగాణ బచావో అనే నినాదంతో ఆయన ప్రజలను చైతన్యవంతులను చేసే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే, గత పద్నాలుగు వందల అరవై రోజులుగా సాగుతున్న ఈ పాలనలో కేవలం విద్వేషమే మిగిలిందని ఆయన పేర్కొన్నారు. హైడ్రా పేరుతో వేలాది మందిని నిరాశ్రయులను చేయడం, మూసీ సుందరీకరణ పేరిట వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేయడం ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు నిదర్శనమని ఆయన లెక్కలు చూపారు. సుమారు రెండు వేల ఎకరాల భూమిని వివాదాల్లోకి నెట్టి, పేదల కడుపు కొట్టడం ఏ ప్రజాస్వామ్య పాలనలో భాగమో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కనీస మానవత్వం లేకుండా వేలాది కుటుంబాలను రోడ్డున పడేయడం మానవ హక్కుల ఉల్లంఘన కాదా అని ఆయన నిలదీశారు. బాధితుల ఆక్రందనలు ప్రభుత్వానికి వినపడటం లేదా అని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్య విలువలకు పాతర వేస్తూ, రాజ్యాంగ సంస్థలను భయభ్రాంతులకు గురి చేయడం రేవంత్ రెడ్డి పాలనలో సర్వసాధారణమైందని కేటీఆర్ దుయ్యబట్టారు. స్వయంగా రాజ్యాంగ పదవిలో ఉండి నియంతల గురించి ప్రస్తావించడం, వారిని కీర్తించడం అంటే ప్రజల తీర్పును అవమానించడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని అరవై శాతం మంది ప్రజలు ఆర్థికంగా చితికిపోతుంటే, ప్రభుత్వం మాత్రం విలాసాలకు, ప్రచార ఆర్భాటాలకు వందల కోట్లు ఖర్చు చేస్తోందని ఆయన ఆరోపించారు. పరిపాలనలో పారదర్శకత మచ్చుకైనా కనిపించడం లేదని, ప్రతి అడుగులోనూ అవినీతి వాసనలు వస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి అహంకార పూరిత మాటలు ప్రజల అసహనానికి అద్దం పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో నియంతృత్వ పోకడలకు చరమగీతం పాడటం కోసం ప్రజలంతా ఏకం కావాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఒక్కో ఓటును వజ్రాయుధంగా మార్చి, నియంతను గద్దె దించే వరకు విశ్రమించేది లేదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఏ ప్రయత్నమైనా గిట్టదని ఆయన హెచ్చరించారు. గతంలో జరిగిన పోరాటాల కంటే ఘనంగా ఈ విముక్తి ఉద్యమం ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అధికార మదంతో విర్రవీగుతున్న పాలకులకు, రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తన మాటలను తేలికగా తీసుకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని ఆయన హెచ్చరిక జారీ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలోకి వచ్చాక మరోలా ప్రవర్తించడం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. హిట్లర్ వంటి కిరాతకులను కీర్తించడం ద్వారా ఆయన తన అసలు స్వరూపాన్ని బయటపెట్టుకున్నారని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఐదు వేల మందికి పైగా కార్యకర్తలు, నాయకులు అక్రమ కేసులను ఎదుర్కొంటున్నారని, ఇదంతా నయా నాజీ పాలన కాక మరేమిటని ఆయన ప్రశ్నించారు. చట్టాలను తమకు అనుకూలంగా మార్చుకుని, ప్రజలను భయపెట్టడం ద్వారా రాష్ట్రాన్ని ఏలాలని చూడటం మూర్ఖత్వమని ఆయన అన్నారు. నిజాన్ని నిలదీసే గొంతులను నొక్కేయడం ద్వారా ముఖ్యమంత్రి తన పతనాన్ని తానే కొనితెచ్చుకుంటున్నారని ఆయన హెచ్చరించారు. నిరంకుశత్వానికి తావు లేని ఈ నేలలో, ప్రజల ఆశీస్సులతో నడుస్తున్న ఈ ఉద్యమం తప్పకుండా ఫలిస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో జరగబోయే రాజకీయ మార్పులు, ప్రభుత్వ తీరును పూర్తిగా మార్చివేస్తాయని ఆయన జోస్యం చెప్పారు. ప్రజా సంక్షేమం కంటే అధికార మార్పిడికే ప్రాధాన్యతనిస్తున్న రేవంత్ సర్కారుకు ప్రజలు త్వరలోనే తగిన పాఠం చెబుతారని ఆయన పేర్కొన్నారు. గులాబీ జెండా నేతృత్వంలో సాగుతున్న ఈ పోరాటం, చివరి రక్తపు బొట్టు వరకు కొనసాగుతుందని ఆయన ప్రకటించారు. తెలంగాణ బచావో అనే నినాదంతో ప్రతి గడప గడపకు వెళ్లి, ప్రభుత్వ అరాచకాలను ఎండగడతామని ఆయన తెలిపారు. హిట్లర్ వంటి దుర్మార్గుల గురించి ముఖ్యమంత్రి గొప్పలు చెప్పుకోవడం రాష్ట్ర ప్రజలందరికీ అవమానకరమని ఆయన మరోసారి గుర్తు చేశారు. చరిత్ర పాఠాలు నేర్చుకోని పాలకులు, పునరావృతమయ్యే తప్పులతో తమ గొయ్యి తామే తవ్వుకుంటారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి తన తీరు మార్చుకోవాలని, లేదంటే ప్రజలు ఇచ్చే తీర్పుకు సిద్ధంగా ఉండాలని ఆయన సవాల్ విసిరారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, ప్రజల ఆత్మగౌరవం కోసం ఎంతటి త్యాగానికైనా తాము సిద్ధమని ఆయన ప్రకటించారు. ఈ పోరాటంలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలని, అప్పుడే నియంతృత్వ పాలన అంతమవుతుందని ఆయన కోరారు. సత్యమేవ జయతే అనే నమ్మకంతోనే తాము ఈ పోరాటాన్ని ముందుకు తీసుకువెళతామని ఆయన స్పష్టం చేశారు.



# చర్చకు సిద్ధమా రేవంత్?

**మొదటిపేజీ తరువాయి**

మూసీ నది ప్రక్షాళన, హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు విస్తరణ వంటి కీలక అంశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పరస్పరం ఆరోపణలు, విమర్శలతో పోరుకు సిద్ధమయ్యారు. అభివృద్ధి ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారని రాష్ట్ర ప్రభుత్వం నుంచి వస్తున్న విమర్శలను కేంద్ర మంత్రి తిప్పికొడుతుండటంతో రాష్ట్రంలో వేడి పెరిగింది. పరిపాలనలో పారదర్శకత, అభివృద్ధి ప్రాధాన్యతలపై ఇరువురు అగ్రనేతలు చేస్తున్న వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ప్రజాక్షేత్రంలో చర్చకు సిద్ధమంటూ ఒకరిపై ఒకరు సవాళ్లు విసురుకోవడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తావిస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు విషయంలో తన వైఖరిని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు అయ్యే అంచనా వ్యయం 1,50,000 కోట్ల రూపాయలని గతంలోనే ప్రభుత్వం పేర్కొంది. మూసీ సుందరీకరణ ద్వారా 55,000 ఎకరాల అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి వాదిస్తున్నారు. మెట్రో రైలు ప్రాజెక్టు మూడవ దశ విస్తరణ కోసం 8,000 కోట్ల రూపాయల నిధుల అవసరం ఉందని ఆయన లెక్కలు చెబుతున్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రం నుంచి రావాల్సిన 4,000 కోట్ల రూపాయల ఆర్థిక సాయం విషయంలో అడ్డంకులు సృష్టిస్తున్నారని ముఖ్యమంత్రి ఆరోపించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసే విషయంలో కూడా కేంద్ర మంత్రి అడ్డుపుల్ల వేస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఈ ఆరోపణలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఘాటుగా తిప్పికొట్టారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలని ఆయన స్పష్టం చేశారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో అవినీతి ఆరోపణలు వస్తున్నాయని, ప్రభుత్వం అస్పష్టమైన లెక్కలతో ముందుకు వెళ్తోందని ఆయన ఆరోపించారు. మెట్రో విస్తరణ ప్రాజెక్టుకు కేంద్రం ఎప్పుడూ వ్యతిరేకం కాదని, గత 10 ఏళ్లలో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం కేంద్రం 1,00,000 కోట్ల రూపాయలకు పైగా నిధులు కేటాయించిందని లెక్కలు వివరించారు. తనపై చేస్తున్న ఆరోపణలు పస లేనివని, ప్రజా సంక్షేమం కోసమే తాను కేంద్రంతో సమన్వయం చేసుకుంటున్నానని కిషన్ రెడ్డి ఉద్ఘాటించారు. రాజకీయాల్లో తన స్థానం, నేపథ్యం గురించి కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. రేవంత్ రెడ్డి వలె తాను పార్టీలు మారలేదని, తన పుట్టుక చావు రెండూ భారతీయ జనతా పార్టీలోనే అని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో 30 ఏళ్లుగా తాను కొనసాగుతున్నానని, ఎప్పుడు ఏ చర్చకైనా తాను సిద్ధమని సవాల్ విసిరారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఎక్కడైనా చర్చకు వేదిక సిద్ధం చేయాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. గత ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టడం, ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న తప్పులను నిలదీయడం ప్రతిపక్ష బాధ్యతని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. మూసీ ప్రక్షాళన అంశంపై కేంద్ర మంత్రి గణాంకాలను తెరపైకి తెచ్చారు. గత 5 ఏళ్లలో నగరంలో వరద నివారణ కోసం కేంద్రం మంజూరు చేసిన 3,000 కోట్ల రూపాయల నిధులు సద్వినియోగం కాలేదని ఆయన ఆరోపించారు. మూసీ ప్రాజెక్టు కోసం కేటాయించిన 1,50,000 కోట్ల రూపాయల వ్యయం ఎక్కడి నుండి వస్తుందో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. డీపీఆర్ (ప్రాజెక్టు నివేదిక) సిద్ధం చేయకుండానే ప్రాజెక్టు ఎలా ప్రారంభిస్తారని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. మెట్రో ప్రాజెక్టు కోసం గతంలో జరిగిన ఒప్పందాల గురించి కూడా ఆయన వివరాలను అడిగారు. ప్రజల ఎదుట ఏ విషయంలోనైనా వాస్తవాలను చెప్పేందుకు తాను వెనుకాడనని కిషన్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని, అయితే తప్పుల తడకగా సాగుతున్న ప్రాజెక్టులను మాత్రం అనుమతించేది లేదని ఆయన చెప్పారు. హైదరాబాద్ నగరం ప్రపంచ స్థాయి నగరంగా ఎదగాలని తాము కోరుకుంటున్నామని, అందుకు మెట్రో రైలు ప్రాజెక్టు కీలకమని ఆయన అంగీకరించారు. 1,000 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి కూడా కేంద్రం నిధులు ఇచ్చిందని, వాటిపై కూడా చర్చించేందుకు తాను సిద్ధమని కిషన్ రెడ్డి ప్రకటించారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని ప్రతిపక్ష నేతగా ఆయన ఆరోపించారు. రాజకీయ క్రీడలో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం సర్వసాధారణమని, అయితే అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా తన పరిధిని, కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా తన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తేనే రాష్ట్రం ముందుకు వెళ్తుందని విశ్లేషణలు వస్తున్నాయి. 1,50,000 కోట్ల రూపాయల మూసీ ప్రాజెక్టు, 8,000 కోట్ల రూపాయల మెట్రో ప్రాజెక్టు వంటి భారీ వ్యయం గల ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రభావితం చేస్తాయని ఆర్థిక వేత్తలు ఆందోళన చెందుతున్నారు. పారదర్శకమైన చర్చల ద్వారానే ఈ వివాదాలకు పరిష్కారం లభిస్తుందని ప్రజలు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి మధ్య సాగుతున్న ఈ వాదోపవాదాలు రాష్ట్ర అభివృద్ధిని స్తంభింపజేయకూడదని సామాన్యులు కోరుకుంటున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని, కేంద్రం నుండి రావాల్సిన నిధులను సక్రమంగా తెచ్చుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు భావిస్తున్నారు. ఆరోపణలు, సవాళ్లు కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడానికేనా లేక నిజంగా అభివృద్ధి కోసమా అనే సందేహం ఓటర్లలో వ్యక్తమవుతోంది. ప్రజాస్వామ్యంలో చర్చకు ఉన్న విలువను గుర్తించి, ఇరువురు నేతలు వాస్తవాలను ప్రజల ముందుకు ఉంచాల్సిన సమయం ఆసన్నమైంది. రాజకీయాల్లో నాయకుల మధ్య విభేదాలు ఉండటం సహజమే అయినప్పటికీ, అవే అభివృద్ధికి అడ్డంకులు కాకూడదని మేధావులు సూచిస్తున్నారు. రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి ఇరువురూ యువతకు, ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రతి రూపాయి కేంద్రం నుండి తెచ్చేందుకు కేంద్ర మంత్రి సహకరించాలి. రాష్ట్రంలో సాగుతున్న అభివృద్ధి పనులకు కావాల్సిన అనుమతులను సత్వరమే ఇచ్చేలా ముఖ్యమంత్రి కృషి చేయాలి. అప్పుడే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందని రాజకీయ పరిశీలకులు ఆశిస్తున్నారు. రాజకీయాల్లో ఆరోపణలు, ప్రత్యారోపణలు తాత్కాలికం. ప్రజలు ఆశించేది శాశ్వతమైన అభివృద్ధి మాత్రమే. 1,50,000 కోట్ల రూపాయల మూసీ ప్రాజెక్టు అయినా, 8,000 కోట్ల రూపాయల మెట్రో విస్తరణ అయినా ప్రజలకే చెందుతాయి. ఆ ప్రాజెక్టులు సకాలంలో పూర్తయితేనే ప్రభుత్వాల మీద నమ్మకం పెరుగుతుంది. వాదోపవాదాలతో సమయాన్ని వృథా చేయకుండా, అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేయడమే ఇరువురు నేతల ముందున్న తక్షణ కర్తవ్యం. అప్పుడే రాష్ట్రాభివృద్ధికి, దేశాభివృద్ధికి నిజమైన అర్థం చేకూరుతుంది.



# కాంగ్రెస్ పోవాలి.. కేసీఆర్ రావాలి

**మొదటిపేజీ తరువాయి**

కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రతి రంగంలోనూ విఫలమైందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, సామాన్యుల జీవితాలు దుర్భరంగా మారాయని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ పాలనలో పెద్దపల్లి జిల్లాలో ఎకరం భూమి 50 నుంచి 60 లక్షల రూపాయల ధర పలికేదని, నేడు కాంగ్రెస్ పాలనలో ఆ ధరలు సగానికి పడిపోయాయని ఆయన విమర్శించారు. రైతుల భూముల విలువ పడిపోవడమే కాకుండా, వారి ఆర్థిక స్థితి దెబ్బతిన్నదని ఆయన ఆవేదన చెందారు. గత రెండున్నరేళ్ల రేవంత్ రెడ్డి పాలనను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం సాగనంపాలని ప్రజలు తీర్మానం చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఎన్ని ఎత్తుగడలు వేసినా, రాబోయే రోజుల్లో 100 స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకోవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిన కేసీఆర్ నాయకత్వం కోసం తెలంగాణ సమాజం ఎదురుచూస్తోందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదని హరీశ్‌రావు దుయ్యబట్టారు. 30 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిపివేసి, వారి విద్యా భవిష్యత్తును రేవంత్ రెడ్డి ఆగం చేశారని ఆయన మండిపడ్డారు. రైతులు ధాన్యం అమ్ముకోవడానికి 45 రోజుల పాటు కల్లాల వద్ద పడిగాపులు కాసినా, ఇప్పటికీ 30 శాతం వడ్లు మార్కెట్లకు చేరలేదని ఆయన గణాంకాలతో సహా వివరించారు. ధాన్యం కొనుగోళ్లలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన తేల్చి చెప్పారు. కేసీఆర్ రైతులకు అండగా రైతుబంధు ప్రవేశపెడితే, నేడు కాంగ్రెస్ సర్కారు యాసంగి పంటకు రైతుబంధును పూర్తిగా ఎగనామం పెట్టిందని ఆయన విమర్శించారు. రుణమాఫీ పేరుతో రేవంత్ రెడ్డి రైతులను దారుణంగా మోసం చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు కల్లా రుణమాఫీ చేస్తానని దేవుళ్ల మీద ఒట్లు పెట్టిన ముఖ్యమంత్రి, బడ్జెట్‌లో ప్రతిపాదించిన 35 వేల కోట్ల రూపాయలలో కనీసం సగం కూడా విడుదల చేయలేదని ఆయన వెల్లడించారు. మండలానికో గోదాం నిర్మించి ఎరువుల కొరత లేకుండా చూసిన కేసీఆర్ పాలనను గుర్తుచేస్తూ, నేడు ఎరువుల కోసం పాత రోజుల మాదిరిగా రైతులు క్యూలైన్లలో లాఠీదెబ్బలు తినాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు నెలలుగా ఎల్ఐసీకి ప్రీమియం కట్టకపోవడం వల్లే, 3 వేల మంది రైతులు మరణించినా రైతు బీమా అందలేదని ఆయన వాపోయారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తును కాలరాస్తూ, రైతు డిస్కం జీవో నంబర్ 8 ద్వారా పగటిపూట కేవలం 7 నుంచి 8 గంటల విద్యుత్ ఇచ్చేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన హెచ్చరించారు. కేసీఆర్ ఇచ్చిన ఉచిత కరెంటుకు ఉరి వేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. భూముల ధరలు, రిజిస్ట్రేషన్ ఫీజులు, ఆర్టీఏ ట్యాక్స్‌లు, మద్యం ధరలు విపరీతంగా పెంచిన ప్రభుత్వం, పథకాలను మాత్రం ఎగ్గొట్టిందని ఆయన విమర్శించారు. తులం బంగారం ఇస్తామని మోసం చేసిన కాంగ్రెస్, పేద పిల్లల చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపేసి తీవ్ర అన్యాయం చేసిందని ఆయన మండిపడ్డారు. పోలీసుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు.



గతంలో ఇచ్చిన సరెండర్ లీవ్స్, టీఏ బిల్లులు, స్టేషన్ అలవెన్స్‌లు ఇప్పుడు ఆగిపోయాయని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్య భద్రతను రద్దు చేయడమే కాకుండా, పోలీసుల జీతంలో 1.5 శాతం కోత విధిస్తున్నారని ఆయన విమర్శించారు. కింది స్థాయి కానిస్టేబుల్ నుంచి సామాన్యుల వరకు అందరూ కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. పోలీసులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం, వారి ఆర్థిక హక్కులను కాలరాస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధానాల వల్ల వ్యవస్థలు పూర్తిగా బలహీనపడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కష్టకాలంలో పార్టీని వీడి వెళ్లిన వారిని మళ్లీ చేర్చుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ క్లిష్ట సమయంలో అండగా నిలబడ్డ కార్యకర్తలే పార్టీకి దైవ సమానులని, వారిని గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. విభేదాలను పక్కన పెట్టి కార్యకర్తలందరూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులందరూ మనోధైర్యంతో ప్రజల్లోకి వెళ్లాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించాలని ఆయన సూచించారు. కార్యకర్తల త్యాగం వృథా కాదని, భవిష్యత్తులో పార్టీ వారి సేవలను గుర్తిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. పెద్దపల్లి జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్న బబ్లు అనే పోలీసు అధికారి తీరుపై హరీశ్‌రావు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినంత మాత్రాన కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం, కొట్టడం సరైంది కాదని ఆయన అన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న అధికారులకు తగిన బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. రేవంత్ రెడ్డి కానీ, స్థానిక ఎమ్మెల్యే కానీ ఎవరూ ఆ అధికారులను కాపాడలేరని ఆయన స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. గతంలో వ్యవసాయ రంగం కేసీఆర్ నాయకత్వంలో పచ్చని పంటలతో విరాజిల్లిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ లోపించి, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పట్ల అమానవీయంగా వ్యవహరిస్తున్నారని, వారికి కనీస వసతులు కల్పించడంలో ఈ పాలకులు విఫలమయ్యారని ఆయన విమర్శించారు. 2026 నాటికి రాష్ట్రంలో కనీస అభివృద్ధి లేదని, కేవలం ప్రకటనలకే ఈ ప్రభుత్వం పరిమితమైందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తప్పుదోవ పట్టించడం ఈ ప్రభుత్వానికి అలవాటైందని ఆయన విమర్శించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై క్షేత్రస్థాయిలో పోరాడాలని వారు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని వారు సూచించారు. కార్యకర్తల సమస్యలను పరిష్కరించడంలో పార్టీ పెద్దపీట వేస్తుందని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని వారు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించి, తిరిగి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు.


## భవన నిర్మాణ కార్మికుల నిరవధిక సమ్మె

**తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్**



**చౌటుప్పల్, విశాలభారతి:** మండల కేంద్రంలో చౌటుప్పల్,నారాయణపూర్ మండలాల భవన నిర్మాణ కార్మికులు శనివారం చౌటుప్పల్ చిన్న కొండూరు రోడ్డు చౌరస్తా వద్ద నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఎండీ. పాషా, గుండెపోని రాములు మాట్లాడుతూ.. 55 ఏళ్లు నిండిన కార్మికులకు రూ.5 వేల పెన్షన్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.20 లక్షలు, సహజ మరణానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుమార్తె పెళ్లికి రూ.లక్ష, ప్రసూతి సాయం రూ.60 వేలు అందించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎండీ. పాషా, గుండెపోని రాములు, బొల్లా మౌని రాములు, నరసింహ, సుక్క యాదయ్య, ఎర్నం శ్రీనివాస్, నెలికంటి నరసింహ, కలకుంట్ల శివకుమార్, వెంకటయ్య, సీమకండ్ల శ్రీరాములు, మడారి మార్క్, సదానందం, నరసింహ, శ్రీను, జువ్వి యాదయ్య, లింగస్వామి, రేఖ మల్లయ్య, ఉబ్బు యాదయ్య, జాజుల బిక్షపతి, గజ్జల రాజు, ఊదరి రామచంద్రం, బందేలా ఈశ్వర్, బాతరాజు లక్ష్మయ్య, గోరిగే సోములు, ఆదిమూలం నందీశ్వర్, కొంగరి మారయ్య, జంగయ్య, పులమోని శంకర్, దుర్గం గాలయ్య, సిరిపంగి దశరథ తదితర కార్మికులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా సూర్కంటి శ్రీధర్ రెడ్డి





**చౌటుప్పల్ విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షులుగా మందోళ్ల గూడెం గ్రామ ఉప సర్పంచ్ సూర్కంటి శ్రీధర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షులు చోట్ల కార్తీక్ ముఖ్య అతిథిగా పాల్గొని నూతనంగా ఎన్నికైన సూర్కంటి శ్రీధర్ రెడ్డి కి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సూర్కంటి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ..తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ఉప సర్పంచ్‌లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ, గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం చోట్ల కార్తీక్ మాట్లాడుతూ.. ఉప సర్పంచ్‌ల సంక్షేమం కోసం ఫోరం బలోపేతానికి శ్రీధర్ రెడ్డి నాయకత్వం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, ఉప సర్పంచ్‌లు, నాయకులు సూర్కంటి శ్రీధర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేశారు. సూర్కంటి శ్రీధర్ రెడ్డి ఎన్నిక ఉప సర్పంచ్‌ల ఐక్యతకు నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు.

## ద్విచక్ర వాహనం చోరీ

**మొయినాబాద్, విశాలభారతి:** ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండల పరిధిలోని కనకమామిడి గ్రామానికి చెందిన జూకంటి వేణుగోపాల్ రెడ్డి తన టీఎస్07 హెచ్ డబ్ల్యు 0146 నెంబర్ గల రాయల్ యోన్ఫీల్డ్ ద్విచక్ర వాహనాన్ని శుక్రవారం రాత్రి తన ఇంటి ముందు పార్క్ చేశాడు. మరుసటి రోజు శనివారం నాడు ఉదయం నిద్రలేచి చూసేసరికి ద్విచక్ర వాహనం కనిపించలేదు. తన వాహనం కోసం చుట్టుప్రక్కల ఎంత వెతికిన దొరకలేదు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశాడు. పిర్యాదుదారుడు తెలిపిన వివరాల ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

**హిమాయత్ నగర్‌లో మరో ద్విచక్ర వాహనం చోరీ**

రాజేంద్రనగర్ పరిధిలోని కిస్మత్ పూర్ ప్రాంతానికి చెందిన తోకటి ప్రదీప్ గురువారం నాడు మధ్యాహ్నం సమయంలో ఏపీ28 ఏజెడ్ 9824 నెంబర్ గల తన స్ప్లెండర్ ప్లస్ ద్విచక్ర వాహనాన్ని హిమాయత్ నగర్ లోని శ్రీ బాలాజీ వైన్స్ ముందు పార్క్ చేశాడు. తిరిగి అదే రోజు రాత్రి సుమారు 11గంటల సమయంలో చూడగా.. తన వాహనం కనిపించలేదు. వెంటనే తన వాహనం కోసం చుట్టుప్రక్కల తెలిసిన ప్రదేశాల్లో ఎంత వెతికిన తన వాహనం దొరకలేదు. వెంటనే పోలీసులకు పిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతుంది

**సర్పంచ్ కీసరి పద్మ సంజీవరెడ్డి**



**మొయినాబాద్, విశాలభారతి:** ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల సాకారమవుతోందని నాగిరెడ్డిగూడ గ్రామ సర్పంచ్ కీసరి పద్మ సంజీవరెడ్డి అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామానికి చెందిన తుప్పరి మహేందర్-వనజ దంపతులు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరు చేసిన రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో తమ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమానికి సర్పంచ్ కీసరి పద్మ సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతోందని అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహ వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సంక్షేమ పాలనలో భాగంగా పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని, ఆ దిశగా ప్రభుత్వం సమర్థవంతంగా ముందుకు సాగుతోందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎర్ర జైపాల్, వార్డు సభ్యులు హేమలత అర్జున్, వనజ కుమార్, యాదగిరి, రాజు, నిరోషా వికాస్, విజయ్‌రాజ్, మధుకర్, రోజా మహేందర్, శశిధర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బంటు సంజీవ, శ్రీకాంత్ రెడ్డి, ఎస్. రవి, శ్రీలత, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్లాపూర్‌మెట్‌లో వరుస చోరీ యత్నాలు

- **ప్లాస్టిక్ షాపులో నగదు అపహరణ.. - మరో రెండు దుకాణాలు టార్గెట్**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**విశాలభారతి , అబ్దుల్లాపూర్‌మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ ఎక్స్‌రోడ్ ప్రాంతంలో గుర్తుతెలియని దుండగులు అర్ధరాత్రి చోరీలకు తెగబడి ఒక దుకాణంలో నగదు అపహరించడంతో పాటు మరో రెండు దుకాణాల్లో చోరీ యత్నం చేసిన ఘటన స్థానిక వ్యాపారుల్లో ఆందోళన కలిగించింది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన చెరుకు రమేష్ గౌడ్ తన ఉమా మహేశ్వరి ప్లాస్టిక్ షాప్‌ను శనివారం రాత్రి 10 గంటల సమయంలో మూసివేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు తిరిగి దుకాణానికి వచ్చి చూడగా, గుర్తు తెలియని దుండగులు షాపు వెనుక భాగంలోని ఇనుప షీట్‌ను కత్తిరించి లోపలికి ప్రవేశించినట్లు గుర్తించాడు. దుకాణంలోని నగదు డ్రాయర్‌ను పరిశీలించగా రూ.1,500 నగదు చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే సమయంలో పక్కనే ఉన్న మంజుల కిరాణా షాప్, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర బేకరీలలో కూడా దుండగులు చోరీకి యత్నించిన ఆనవాళ్లు కనిపించాయి. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.

## రైతులకు భరోసా కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం



- **ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్**
- **గుండ్రాంపల్లి పీఏసీఎస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్ రెడ్డి హర్షం**

**చిట్యాల, విశాలభారతి :**

మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రం విజయవంతంగా పూర్తికావడం పట్ల ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్, గుండ్రాంపల్లి పీఏసీఎస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆదివారం స్థానిక రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయడంతో పాటు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు రవాణా భారాన్ని తగ్గించడంతో పాటు మధ్యవర్తుల దోపిడీకి అడ్డుకట్ట పడిందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేసిన రైతులు, అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులకు ఆయన అభినందనలు తెలిపారు.బీ ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆకుల కృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ దోర్నాల రామచంద్రయ్య, శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ బుస్సు శ్రీనివాస్, మాజీ చైర్మన్ గోపగోని నరసింహ, వార్డు సభ్యులు బడే రవి, కుంభం కిష్టయ్య, కుర్మతి భిక్షపతి, నాయకులు బండ అంజయ్య, బుస్సు నర్సింహ, బొడిగె బాలరాజు, గోపగోని లింగస్వామి, అన్నెబోయిన రమేష్, బుస్సు మధుసూదన్, జవాజి శేఖర్, రైతులు భీమిడి చంద్రారెడ్డి, బత్తుల దేవయ్య, కార్యాలయ సిబ్బంది పైళ్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## షాబాద్ మండలంలో వర్షం బీభత్సం – ఈదురుగాలులకు నష్టం, పిడుగుపాటుకు మహిళ మృతి




**చేవెళ్ల, విశాల భారతి:**

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని షాబాద్ మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం, ఈదురుగాలులు తీవ్రంగా విరుచుకుపడ్డాయి. నాగర్ గూడా, తాళ్లపల్లి, తిమ్మారెడ్డి గూడ, రుద్రారం, పోతుగల్ గ్రామాలతో పాటు చేవెళ్ల మండలంలోని గుండాల, అల్లాడ పరిసర ప్రాంతాలు ఈ అకస్మాత్తు వాతావరణ మార్పుతో ప్రభావితమయ్యాయి. ఒకేసారి ఉధృతంగా వర్షం కురవడంతో పాటు బలమైన ఈదురుగాలులు వీయడంతో గ్రామాల్లో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ముఖ్యంగా నాగర్ గూడా గ్రామంలో ఉన్న ఫైవ్ స్టార్ బావర్చి హోటల్‌పై ఉన్న టిన్ షీట్లు గాలికి ఎగిరిపోయి పక్కనే పార్క్ చేసిన కారుపై పడిపోయాయి. దీంతో ఆ కారు పూర్తిగా దెబ్బతిని వినియోగానికి పనికిరాని స్థితికి చేరింది. ఈ ఘటన స్థానికుల్లో ఆందోళనకు కారణమైంది. ఇక గాలుల వేగం ఎక్కువగా ఉండటంతో పలు ప్రాంతాల్లో చెట్లు వేరుతో సహా కూలిపోయాయి. కొన్ని చోట్ల విద్యుత్ సరఫరా అంతరాయం కలిగినట్లు సమాచారం. గ్రామాల మధ్య రాకపోకలు కూడా కొంతసేపు నిలిచిపోయాయి. ఇదే సమయంలో చేవెళ్ల మండలంలోని కేసారం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. భారీ వర్షంతో పాటు పిడుగు పడటంతో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అధికారులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ఈదురుగాలులు, పిడుగులు పడే అవకాశం ఉన్నందున అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెట్ల క్రింద నిలబడకూడదని, పాత ఇళ్లలో జాగ్రత్తగా ఉండాలని, వర్ష సమయంలో విద్యుత్ పరికరాలను దూరంగా ఉంచాలని సూచించారు. మొత్తానికి, ఆకస్మికంగా వచ్చిన ఈ వర్షం మరియు ఈదురుగాలులు ప్రజలకు ఇబ్బందులు కలిగించడంతో పాటు ఆస్తి నష్టం, ప్రాణ నష్టం కూడా చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

## బాబాయ్–అబ్బాయ్ పాలన వల్లే డ్రైనేజీ కష్టాలు

**జక్కిడి సత్య తేజ్ రెడ్డి**



**విశాలభారతి , అబ్దుల్లాపూర్‌మెట్ :** మన్సూరాబాద్ డివిజన్‌లోని శైలజాపురి కాలనీలో కేబీఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో గత కొద్ది రోజులుగా డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని, దీనికి గత పాలకుల నిర్లక్ష్యమే కారణమని యువజన కాంగ్రెస్ నాయకుడు జక్కిడి సత్య తేజ్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఉదయం స్థానిక కాలనీవాసులతో కలిసి సమస్యాత్మక ప్రాంతాన్ని సందర్శించిన సత్య తేజ్ రెడ్డి, డ్రైనేజీ పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజల సమస్యలను తెలుసుకుని వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం సత్యతేజ్ రెడ్డి మాట్లాడుతూ..గత 15 సంవత్సరాలుగా మన్సూరాబాద్ డివిజన్‌కు ప్రాతినిధ్యం వహించిన మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి, కొప్పులత, కొప్పుల నర్సింహా రెడ్డి డివిజన్ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. వారి కుటుంబం అభివృద్ధి చెందినా, డివిజన్ అభివృద్ధి మాత్రం జరగలేదని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముందుచూపుతో డ్రైనేజీ వ్యవస్థను నిర్మించి ఉంటే నేడు కాలనీవాసులు ఈ ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వచ్చేది కాదు. రాబోయే తరాల అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరించడం బాధాకరం అని పేర్కొన్నారు.డ్రైనేజీ సమస్య వల్ల స్థానికులు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని, ఈ అంశాన్ని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అలాగే డివిజన్‌లోని పెండింగ్ సమస్యలన్నింటినీ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. శైలజాపురితో పాటు పరిసర కాలనీల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండే శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని, సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు ప్రజలతో కలిసి పోరాడుతామని సత్య తేజ్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాంగ్రెస్ నాయకులు బాలరాజ్, సాయి, విట్టల్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొని స్థానిక సమస్యలపై చర్చించారు.

## డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు

**జిహెచ్‌ఎంసి నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం**

**రాజేంద్రనగర్, విశాలభారతి:** జిహెచ్‌ఎంసి పరిధిలోని 121, 122, 123 డివిజన్లలో డ్రైనేజీ సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. సుమారు 40 వేల పైచిలుకు ఇళ్లు ఉన్న ఈ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు నెలనెలా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, ప్రాథమిక సదుపాయాల విషయంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ఎదుర్కొంటున్నారు. గత రెండు నెలలుగా డ్రైనేజీ శుభ్రపరిచే యంత్రాలు సరిపడా అందుబాటులో లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్న ఒకే ఒక్క యంత్రం కూడా పనిచేయని స్థితిలో ఉండటంతో సమస్య మరింత పెరిగింది. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన లేకపోవడం పట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం ప్రైవేట్ వాహనాల ద్వారా డ్రైనేజీ శుభ్రపరిచే పనులు కొనసాగిస్తున్నామని చెబుతున్నప్పటికీ, రెండు చిన్న ఆటో వాహనాలతో నిర్వహిస్తున్న ఈ పనులు సరిపోక సమస్యలు అలాగే కొనసాగుతున్నాయని స్థానికులు అంటున్నారు. ఇప్పటికే వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పరిస్థితి మరింత విషమించే అవకాశముందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు డ్రైనేజీలు ముంచెత్తి రోడ్లపై నీరు నిలిచిపోవడం, దుర్వాసన, దోమల సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని వారు చెబుతున్నారు. ఇంత పెద్ద సంఖ్యలో ఇళ్లు ఉన్న ప్రాంతాలకు ఎంతమాత్రం యంత్రాలు అవసరమో కూడా లెక్కచేయకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్న ప్రభుత్వం, వారికి అవసరమైన సేవలు అందించడంలో విఫలమవుతోందని వారు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను సరిచేసి, అవసరమైన యంత్రాలను సమకూర్చాలని ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో ప్రజలే తమ సొంత ఖర్చులతో పనులు చేయించుకునే పరిస్థితి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# అటవీ జంతువుల వేట, చెట్ల నరికివేతపై కఠిన చర్యలు

**ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ స్నేహలత**



**పినపాక, విశాలభారతి :** అటవీ జంతువుల వేట, చెట్ల నరికివేతపై కఠిన చర్యలు తప్పవని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ స్నేహలత హెచ్చరించారు. పినపాక మండలం ఈ బయ్యారంలో ఆదివారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ స్నేహలత మాట్లాడుతూ అటవీ జంతువులను వేటాడినా, చెట్లను అక్రమంగా నరికినా కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణ కోసం అడవి ప్రాంతాల్లో సోలార్ ఆధారిత సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కెమెరాల ద్వారా అటవీ ప్రాంతాలపై నిరంతర నిఘా కొనసాగుతోందని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజలు అటవీ సంరక్షణకు సహకరించాలని ఆమె కోరారు.

# నల్లగొండ జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా కుంభం ఇంద్రసేనారెడ్డి



**మునుగోడు, విశాలభారతి :** టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కమిటీ అనుబంధమైన నల్లగొండ జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా కుంభం ఇంద్రసేనారెడ్డిని నియమిస్తూ టీయూడబ్ల్యూజే (ఐజేయు) నల్గొండ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి శనివారం రాత్రి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ లక్ష్యంగా జిల్లా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇటీవల నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన జిల్లా మహాసభల్లో జిల్లా కమిటీతో పాటు నల్లగొండ జిల్లా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని కూడా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన కుంభం ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ,జిల్లా నాయకత్వానికి,వివిధ హోదాలలో ఉన్న సంఘం బాధ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు వీరహత్ హోలీ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ, జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మాదరి యాదగిరి, ఏరెడ్ల చంద్రశేఖర్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. సంఘం బలోతమే లక్ష్యంగా, అందరి సహకారంతో ముందుకు సాగుతాననీ తెలిపారు.జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా ఎంపిక అయిన కుంభం ఇంద్రసేనారెడ్డికి మండల, జిల్లా వ్యాప్తంగా పలువురు జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# కొత్తూరు(సి)లో మహిళా సమైక్య భవనాల శంకుస్థాపన



**కురవి విశాలభారతి:** కురవి మండలంలోని కొత్తూరు(సి) గ్రామంలో వివిధ గ్రామాల మహిళా సమైక్య భవనాల శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. డోర్నకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ ముఖ్య అతిథిగా హాజరై భవనాల నిర్మాణ పనులను ప్రారంభించారు. మహిళా సమైక్య భవనాల నిర్మాణం కోసం రూ.10 లక్షల వ్యయాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రామచంద్రు నాయక్ మాట్లాడుతూ, మహిళా సంఘాలు గ్రామీణాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, ప్రతి మహిళా సంఘం సమాజంలోని ప్రతి కుటుంబానికి సుస్థిర మార్గదర్శకంగా నిలవాలని అన్నారు. మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్, కురవి మండల అధ్యక్షులు అంబటి వీరభద్రం గౌడ్, పీఎస్ఎస్ చైర్మన్ గార్లపాటి వెంకట్ రెడ్డి, టీపీసీసీ డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీరన్న నాయక్, సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు బాలగాని శ్రీనివాస్, కొత్తూరు(సి) గ్రామ సర్పంచ్ బాదావత్ చిన్ని సిరి నాయక్, ఉపసర్పంచ్ పగడాల కృష్ణారెడ్డి, గ్రామ అధ్యక్షులు మలిశెటి వేణు తదితరులు పాల్గొన్నారు. మహిళా సమైక్య భవనాలు ప్రాంతీయ మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యకలాపాలకు ఉపయోగపడనున్నాయని నాయకులు తెలిపారు. ఈ భవనాల నిర్మాణంతో మహిళా సాధికారతకు మరింత బలం చేకూరుతుందని, డోర్నకల్ నియోజకవర్గంలో సమగ్ర అభివృద్ధికి ఇది దోహదపడుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# ఈ నెల10న కలెక్టరేట్ ఆందోళనకు తరలండి

**నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు**



**కురవి విశాలభారతి:** పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించాలని కలెక్టరేట్ వద్ద ఈ నెల10న సిపిఐ ఆధ్వర్యంలో జరిగే ఆందోళనలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ కొరివి మండలం కౌన్సిల్ సమావేశం పార్టీ కార్యాలయంలో జరగగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గత 12 సంవత్సరాల బిజెపి పాలనా వైఫల్యం వలన నిత్యావసర వస్తువుల ధరలు పెట్రోల్ డీజిల్ గ్యాస్ దరలు అడ్డు అదుపు లేకుండా పెరిగాయని, కార్పొరేట్ కంపెనీలకు వేలకోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ సామాన్యుడిపై విపరితమైన ధరల పెరుగుదలతో మోయలేని పెనుభారాన్ని మోపుతూ మోదీ గారడి మాటలతో ప్రజలను ధగా చేస్తూ పాలన సాగిస్తున్నాడని, ప్రజల ఆదాయాలు ఏమాత్రం పెరగకపోగా ఖర్చులు మాత్రం విపరీతంగా పెరిగిపోతూ పేదరికం, నిరుద్యోగం మును పెన్నడూ లేని విధంగా పెరిగినా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని, ధరల పెరుగుదలతో సామాన్యుడునీ లూటీ చేస్తున్న బిజెపి దివాలకోరు పాలనపై ప్రజలు నిరసన ఆందోళన కార్యక్రమాలతో తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు బుడమ వెంకన్న,టౌన్ కార్యదర్శి తురక రమేష్, దూదికట్ల సారయ్య, కన్నె వెంకన్న,రమేష్ బాబు, కలగూర నాగరాజు పాల్గొన్నారు.

# బి.బి. నాయక్ తండాలో మహిళా సమైక్య భవనాల శంకుస్థాపన




**కురవి విశాలభారతి:** కురవి మండలంలోని బి.బి. నాయక్ తండా కేంద్రంలో వివిధ గ్రామాల మహిళా సమైక్య భవనాల శంకుస్థాపన కార్యక్రమాన్ని డోర్నకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు గ్రామీణ అభివృద్ధికి కీలక శక్తిగా నిలుస్తున్నాయని, మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. నిర్మించబడనున్న మహిళా సమైక్య భవనాలు మహిళల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యకలాపాలకు ఉపయోగపడనున్నాయని తెలిపారు. ప్రతి మహిళా సంఘం సమాజంలోని ప్రతి కుటుంబానికి సుస్థిర మార్గదర్శకంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్, కురవి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి వీరభద్రం గౌడ్, పీఎస్ఎస్ చైర్మన్ గార్లపాటి వెంకట్ రెడ్డి, టీపీసీసీ డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీరన్న నాయక్, సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, బాలగాని శ్రీనివాస్, బి.బి. నాయక్ తండా సర్పంచ్ భూక్య కవిత సుధాకర్ తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ భవనాల నిర్మాణంతో ప్రాంతీయ మహిళా సమైక్య సంఘాలకు ఆధునిక వసతులు కల్పించబడటంతో పాటు మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. డోర్నకల్ నియోజకవర్గంలో మహిళా సాధికారతకు ఈ శంకుస్థాపన కార్యక్రమం ఒక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట..!








- **శంకుస్థాపనకే పరిమితమైన తట్టుపల్లి హెల్త్ సబ్ సెంటర్ భవన నిర్మాణం!**
- **రెండేళ్లు గడుస్తున్నా అడుగు ముందుకు పడని వైనం**
- **పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్, జిల్లా వైద్యాధికారులు**
- **గ్రామసభల్లో ఏకగ్రీవ తీర్మానాలు చేసినా స్పందన కరువు.**
- **ప్రభుత్వాలు మారినా మారని తట్టుపల్లి ప్రజల వైద్య కష్టాలు**

**కురవి విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం తట్టుపల్లి గ్రామ ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో మంజూరైన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం (హెల్త్ సబ్ సెంటర్) నూతన భవన నిర్మాణం అధికారుల, ప్రజాప్రతినిధుల తీవ్ర నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంగా నిలిచింది. నాటి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్థానిక అప్పటి ఎమ్మెల్యే రెడ్యానాయక్ చొరవతో వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా ఈ భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు అయ్యాయి. ఎంతో ఆర్భాటంగా 2023 అక్టోబర్ 4న శంకుస్థాపన కూడా పూర్తి చేశారు. అయితే, శంకుస్థాపన రాయి వేసి రెండేళ్లు గడుస్తున్నా, నేటికీ అక్కడ ఒక్క ఇటుక కూడా పడకపోవడంపై స్థానిక గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా మారని రాత..!**

రాష్ట్రంలో ప్రభుత్వం మారి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి, స్థానిక ఎమ్మెల్యేగా రాంచంద్రు నాయక్ బాధ్యతలు స్వీకరించినప్పటికీ ఈ పనుల్లో ఎలాంటి చలనం లేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్లు కావస్తున్నా, స్థానిక ఎమ్మెల్యే ఈ నిలిచిపోయిన భవన నిర్మాణ పనులపై కనీస చొరవ చూపకపోవడం గమనార్హం. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల సమన్వయ లోపం, పర్యవేక్షణ కరువడం వల్లే ఈ పనులు గుత్తేదారు (కాంట్రాక్టర్) ప్రారంభించడం లేదని స్పష్టమవుతోంది. అసలు ఈ పనులను దక్కించుకున్న గుత్తేదారు ఎవరనే సమాచారం కూడా గ్రామ ప్రజలకు తెలియకుండా గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**గ్రామసభల తీర్మానాలకూ విలువ లేదా?**

గ్రామంలో ప్రత్యేక పాలన (స్పెషల్ ఆఫీసర్) సాగిన సమయంలో నిర్వహించిన గ్రామసభలో ఈ నూతన భవన నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని ప్రజలు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఆ తర్వాత గ్రామానికి నూతన పాలకమండలి కొలువుదీరిన అనంతరం జరిగిన 'ప్రజాపాలన' గ్రామసభలో సైతం వార్డు సభ్యులు, ప్రజలు కలిసి భవన నిర్మాణం చేపట్టాలని గట్టిగా తీర్మానించారు. గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ ముఖ్య నాయకులు పలుమార్లు ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. అయినప్పటికీ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు గానీ, కాంట్రాక్టర్ గానీ స్పందించకపోవడం గమనార్హం.

**అధికారుల నిర్లక్ష్యమా? గుత్తేదారు లీలలా?**

రూ. 20 లక్షలు ప్రభుత్వ నిధులు మంజూరై, అన్ని అనుమతులు ఉన్నప్పటికీ ఈ భవన నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభం కావడం లేదనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది. ఇది జిల్లా వైద్యాధికారుల పర్యవేక్షణా లోపమా? లేక అడ్వాన్స్ తీసుకుని పనులు చేయకుండా తప్పించుకుంటున్న గుత్తేదారు నిర్లక్ష్యమా? అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల ఉదాసీనత వల్లే గుత్తేదారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, అందుకే పనులు మొదలుపెట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు మండిపడుతున్నారు.

**ఎమ్మెల్యే గారు..., ఇప్పటికైనా స్పందించండి!**

గ్రామంలో సరైన వైద్య వసతులు లేక అత్యవసర పరిస్థితుల్లో కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని తట్టుపల్లి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ తక్షణమే స్పందించి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులను, గుత్తేదారును గట్టిగా మందలించి, నిలిచిపోయిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం నూతన భవన నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తట్టుపల్లి గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# ప్రభుత్వాలు మారినా ప్రజల బతుకులు మారలేదు

- **తెలంగాణ ప్రజల ఆకాంక్షలు ఇంకా నెరవేరలేదు**
- **బీసీ పీపుల్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్**
- **కులగణన నిర్ణయానికి స్వాగతం – నియోజకవర్గాల పునర్విభజనలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్**




**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తవుతున్నా తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ముఖ్యంగా అట్టడుగు వర్గాల జీవన పరిస్థితుల్లో ఆశించిన మార్పులు రాలేదని బీసీ పీపుల్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ అన్నారు. ప్రభుత్వాలు మారినా సాధారణ ప్రజల బతుకులు మాత్రం మారలేదని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. సమాజంలో అసమానతలు పెరిగే కొద్దీ తిరుగుబాట్లు అనివార్యమవుతాయని హెచ్చరించారు. తెలంగాణలో అభివృద్ధి పేరుతో చేపడుతున్న అనేక నిర్మాణ పనులు ప్రజల ప్రయోజనాల కంటే పాలకులకు ఏటీఎంలుగా మారాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, ఆ తర్వాత మాట మార్చిందని విమర్శించారు. డిగ్రీలు, పీజీలు పూర్తి చేసిన వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో అడ్డా కూలీలు, సెక్యూరిటీ గార్డులుగా పనిచేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత కారణంగా విద్యార్థులు ప్రైవేట్ విద్యా సంస్థల వైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ జరుగుతున్నప్పటికీ దానిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కొన్ని రాజకీయ పార్టీలు ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి ప్రాంతీయ భావజాలాన్ని దెబ్బతీయడానికి కుట్రలు చేస్తున్నాయని వెంకటేష్ గౌడ్ అన్నారు. దేశంలో సామాజిక సమతుల్యత, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని ప్రస్తావిస్తూ, ఉత్తరాది రాష్ట్రాలకు అనుకూలంగా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగే విధంగా నిర్ణయాలు తీసుకుంటే బీసీ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో అమలు చేసిన తర్వాతే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన నిర్వహించాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కులగణన ద్వారా వెనుకబడిన వర్గాల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన సమాచారం లభించి సంక్షేమ పథకాల అమలుకు ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. బీసీల హక్కులు, సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం తమ పోరాటం కొనసాగుతుందని బొంగు వెంకటేష్ గౌడ్ స్పష్టం చేశారు.

# కవి వెంకటేష్ కు ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల పురస్కారం

**విశాలభారతి, నిర్మల్ :**



నిర్మల్ కు చెందిన ప్రముఖపద్యకవి, వ్యాఖ్యాత,సంస్కృతభాషా ప్రచార సమితి ఆదిలాబాదు నిజామాబాదు ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షులు డా" బి. వెంకట్ ఆంధ్రప్రదేశ్ లోని రాజమహేంద్రవరములో ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల పురస్కారమును స్వీకరించారు. రా జ మ హేం ద్ర వ ర ము లో ని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయములో చైతన్య సారస్వత పరిషత్,శ్రీ శ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో 6,7 వ తేదులలో జరిగిన 7 వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ డా" కత్తిమండ ప్రతాప్ కుమార్, జాతీయ అధ్యక్షురాలు జి ఈశ్వరీభూషణం, జాతీయ ప్రణాళిక అధికారి డా" టి పార్థసారథి, గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, కె .వి. వి సత్యనారాయణరాజు ల చేతులమీదుగా ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల పురస్కారమును ప్రముఖపద్యకవి డా బి.వెంకట్ అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రక్షణదళం కమాండెంట్ కొండా నరసింహ్మారావు, పూర్వం ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా" ఎం శ్రీనివాస్ రావు, ప్రముఖ విశ్లేషకులు యర్రాప్రగడ రామకృష్ణ కృష్ణ, శ్రీనాథ కవిసార్వభౌముడు ఇ 13 వ తరం వారసుడు కావూరి శ్రీనివాస్ శర్మ, కాసుల పురుషోత్తమకవి 5 వ తరౌ వారసుడు కాసుల కృష్ణంరాజు, కంచర్ల గోపన్న 10 వ తరం వారసుడు కంచర్ల శ్రీనివాసరావు, కవయిత్రి మొల్ల 14 వ తరం వారసుడు డా ఎన్ శివశంకర్ లు పా ల్గొన్న ఈ సభల్లో వెంకట్ కవిసమ్మేళనము, సాహిత్య సభలకు విశిష్ఠ అతిథిగా, సమన్వయకర్త గా పాల్గొన్నారు. తెలుగుభాషా వైభవంపై పద్యపఠనగానం చేశారు. ఇందుకు గుర్తింపుగా ఆయన ఈ పురస్కారమును అందుకున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు, నాటకాలు, గేయాలు, నృత్యాలు వంటి కార్యక్రమాలకు ప్రతినిధులుగా పాల్గొన్నారు.

# జలకం రత్తమ్మకి ఘన నివాళి



**భద్రాచలం, విశాలభారతి:** అల్లూరి సీతారామరాజు కాలనీలోని ఆదివాసీ కుల పెద్ద శ్రీమతి జలకం రత్తమ్మ అకాల మరణం చెందారు. ఆమె భౌతికకాయాన్ని ఆదివాసీ నాయకులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 1988లో అల్లూరి సీతారామరాజు కాలనీ సాధన కోసం రత్తమ్మ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అలాగే కొత్త మార్కెట్ లో నిర్మించిన షాపులను ఆదివాసీలకు కేటాయించే విషయంలో ఆమె విశేష కృషి చేశారని పేర్కొన్నారు. కాలనీలో నిర్వహించే సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లు, నిర్వహణలోనూ ఆమె ఎప్పుడూ ముందుండి సేవలందించేవారని కొనియాడారు. ఆదివాసీ సమాజ అభివృద్ధి కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. అనంతరం నాయకులు రత్తమ్మ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనెం కృష్ణ, కుంజా ధర్మారావు, మానె రామకృష్ణ, పూనెం వీరభద్రం, గుండి శరత్, జగ్గా పుల్లయ్య, జగ్గా కుమారి, సున్నం భూలక్ష్మి, కోర్సా చినబాబు దొర, కుంజా శ్రీను, కుంజా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్నివీర్‌గా ఎంపికైన ఎండి ఇమ్రాన్‌కు సన్మానం



**విశాలభారతి :** కరకగూడెం మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన ఎండి ఇమ్రాన్ అగ్నివీర్ సెలక్షన్‌లో ఎంపిక కావడం పట్ల కరకగూడెం మండల తుడుం దెబ్బ కమిటీ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, మండల నాయకులు కలం సంపత్ కుమార్, సాంబమూర్తి, వేణుగోపాల్ పాల్గొని ఎండి ఇమ్రాన్‌కు శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. అగ్నివీర్‌గా ఎంపిక కావడం గ్రామానికి, మండలానికి గర్వకారణమని పేర్కొన్నారు. అలాగే రఘునాథపాలెం పంచాయతీ ఆదివాసి యువత ప్రతినిధులు పోలెబోయిన రాంగోపాల్, నరేష్, రాజు, కార్తీక్, అభిలాష్, తేజ, పాపారావు, కొమరం వెంకన్న, ఆకాష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని ఇమ్రాన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కరకగూడెం మండల తుడుం దెబ్బ కమిటీ నాయకులు మాట్లాడుతూ, ఎండి ఇమ్రాన్ సాధించిన విజయం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ముఖ్యంగా ఆదివాసి యువత ఇదే స్ఫూర్తితో దేశ సేవకు ముందుకు వచ్చి సైన్యం, అగ్నివీర్, పోలీస్ మరియు ఇతర ప్రభుత్వ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకొని తమ ప్రతిభను నిరూపించాలని పిలుపునిచ్చారు. కష్టపడి చదివి, క్రమశిక్షణతో శ్రమిస్తే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని, ఆదివాసి యువత సమాజ అభివృద్ధికి మరియు దేశ ప్రగతికి తమ వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు.

# బౌద్ధ వందన కోసం విహార్‌కు తరలివచ్చిన ఉపాసకులు

**విశాలభారతి, భైంసా :** నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో గల నర్సింహా నగర్ లోని ఉన్న బుద్ధ విహార్ లో ప్రతి ఆదివారం జరిగే బుద్ధ వందన కార్యక్రమానికి ప్రతి ఒక్కరు పాల్గొనాలని బౌద్ధ చార్య పాండురంగ్ జాదవ్ అన్నారు. ఈ సందర్భంగా బౌద్ధ వందన కోసం భారీ సంఖ్యలో తరలివచ్చిన బౌద్ధ ఉపసిక ఉపసకులు, విహార్ టీం ఆధ్వర్యంలో ఆదివారం బుద్ధ వందన నిర్వహించారు. అంతకుముందు అందరూ సామూహికంగా కలసి బుద్ధ మూర్తికి తో పాటు అంబేద్కర్ రమాబాయి చిత్రపటానికి కొవ్వొత్తులు వెలిగించి, ప్రత్యేకంగా పుష్పాలు వేసి బుద్ధ వందన దమ్మ వందన, సంఘ వందన చేశారు. అనంతరం త్రి శరణం పంచశీలతో వందన సమర్పణ చేపట్టారు, అనంతరం విహార్ కు వచ్చిన వాళ్లకు విశ్రాంతి ఉద్యోగి లోఖండే నంద ప్రకాష్ ఆధ్వర్యంలో బౌద్ధ విహారులు ఉపశక ఉపసికలకు ఉచితంగా మహా అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం హైదరాబాద్ పట్టణనికి చెందిన సురేష్ సరోదే యొక్క కీ.శే.కాంతాబాయి పేరు మీద బుద్ధ విహార్ అభివృద్ధి కోసం 25 వేలు రూపాయలు బుద్ధ విహార్ టీం సభ్యులకు అందించారు. దీంతో విహార్ టీం సభ్యులు కలసి సురేష్ సరోదే కు ప్రత్యేకంగా జై భీమ్ లు తెలియజేశారు. అంతేకాకుండా వారికి ప్రత్యేక శాలువా పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి భైంసా పట్టణంతో పాటు పరిసరాల గ్రామాలతో పాటు భారీ సంఖ్యలో బౌద్ధ ఉపవాసకులు పాల్గొన్నారు.



# శ్రీగంధం తోటను లక్ష్యంగా చేసుకున్న దుండగులు?

- వరుస అగ్నిప్రమాదాలతో రైతుకు భారీ నష్టం
- ఆరేళ్ల శ్రమను అగ్నికి ఆహుతి చేసిన గుర్తుతెలియని వ్యక్తులు
- దుండగుల చేతివాటమా..? కక్షపూరిత చర్యలపై రైతు అనుమానం
- డ్రిప్ ఇరిగేషన్, గేట్ వాల్వులు సహా వ్యవసాయ పరికరాలు బూడిద
- శ్రీగంధం తోటపై ఎవరి కన్ను..? వరుస ఘటనల వెనుక మిస్టరీ






**కురవి, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బలపాల గ్రామానికి చెందిన రైతు నెల్లూరి శ్రీనివాసులు చెందిన శ్రీగంధం తోటలో మరోసారి అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో భారీ ఆర్థిక నష్టం సంభవించింది. ఈ ఘటన ఉద్దేశపూర్వకంగా జరిగిందని అనుమానిస్తున్న బాధిత రైతు, కురవి పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేసి దర్యాప్తు చేపట్టాలని కోరారు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం, గత ఆరు సంవత్సరాలుగా ఎంతో శ్రమ, సమయం, ఆర్థిక వ్యయంతో అభివృద్ధి చేసిన శ్రీగంధం తోటలో జూన్ 6న మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించినట్లు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో సుమారు 8 ఎకరాల మేర శ్రీగంధం తోట, డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ, గేట్ వాల్వులు, ఇతర వ్యవసాయ పరికరాలు పూర్తిగా దగ్ధమై భారీ నష్టం సంభవించింది. ఇదే తోటలో గతంలో కూడా పలుమార్లు అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయని, గత ఏడాది నాలుగు ఎకరాల మేర నష్టం వాటిల్లిందని రైతు శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల రెండు సార్లు నిప్పు పెట్టే ప్రయత్నాలను గుర్తించి అడ్డుకున్నప్పటికీ, ఈసారి తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వరుసగా జరుగుతున్న ఈ ఘటనలు యాదృచ్ఛికంగా కాకుండా కక్షపూరితంగా జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేసిన రైతు, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కురవి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే ఘటనపై సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రు నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సంఘటనపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించి, జరిగిన నష్టాన్ని అధికారికంగా అంచనా వేసి ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందించాలని ఆయన కోరారు.

**ప్రభుత్వం స్పందించి రైతుకు న్యాయం చేయాలి: రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నెల్లూరి నాగేశ్వరరావు.**

ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నెల్లూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ, రైతు శ్రీనివాసులకు జరిగిన నష్టం చాలా తీవ్రమైందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యేక విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత రైతుకు తగిన నష్టపరిహారం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనతో బలపాల గ్రామంలో ఆందోళన వ్యక్తమవుతుండగా, దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

# కాంగ్రెస్ పాలనలో చెరువులను తలపిస్తున్న రహదారులు!

- నేతాజీ కాలనీ మెయిన్ రోడ్ – విలేజ్ లింక్ రోడ్ దుస్థితి
- మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి ఆగ్రహం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పూర్తిగా గాలికొదిలేసిందని, ముఖ్యంగా రహదారుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి విమర్శించారు. హయత్‌నగర్ పరిధిలోని నేతాజీ కాలనీ మెయిన్ రోడ్ నుంచి విలేజ్ లింక్ రోడ్ వరకు ఉన్న రహదారి అధ్వాన్నంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ తిరుమల రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం రహదారులు చెరువులను తలపిస్తున్నాయని, ఎక్కడ చూసినా గుంతలే కనిపిస్తున్నాయని అన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో గుంతలు ఎక్కడున్నాయో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు నిత్యం భయాందోళనల మధ్య ప్రయాణిస్తున్నారని తెలిపారు.ప్రధాన కూడళ్లు, కాలనీల రహదారులు కనీసం నడిచేందుకు కూడా అనుకూలంగా లేని పరిస్థితి నెలకొన్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని ఆయన ఆరోపించారు. స్థానిక కాలనీ అసోసియేషన్లు, ప్రజలు పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు కనిపించడం లేదన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ రహదారుల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సామ తిరుమల రెడ్డి డిమాండ్ చేశారు. యుద్ధప్రాతిపదికన గుంతలను పూడ్చి, దెబ్బతిన్న రహదారులను పునర్నిర్మించాలని కోరారు. అభివృద్ధి పేరుతో పెద్ద పెద్ద ప్రకటనలు చేస్తున్న ప్రభుత్వం, ప్రజల నిత్యజీవితానికి సంబంధించిన మౌలిక సదుపాయాలపై కూడా దృష్టి సారించాలని సూచించారు.ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే విధంగా రహదారులను నిర్లక్ష్యం చేయడం తగదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నేతాజీ కాలనీ మెయిన్ రోడ్ - విలేజ్ లింక్ రోడ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి అని మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్సీ రవీందర్ రావు సతీమణిని పరామర్శించిన డీఎస్ రెడ్యా నాయక్



**మహబూబాబాద్, విశాలభారతి:** బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ తక్కళ్ళపల్లి రవీందర్ రావు సతీమణి సంధ్యారాణి ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డి ఎస్ రెడ్యా నాయక్ ఆదివారం వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న డీఎస్ రెడ్యా నాయక్, వైద్యుల సూచనలు పాటిస్తూ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్సీ రవీందర్ రావు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. సంధ్యారాణి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్కాల పూలమ్మను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



మహబూబాబాద్ విశాలభారతి: మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ నాయకులు పర్కాల శ్రీనివాస్ రెడ్డి తల్లి పర్కాల పూలమ్మ ఇటీవల హైదరాబాద్‌లో శస్త్రచికిత్స చేయించుకుని మహబూబాబాద్‌లోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ ఆదివారం వారి నివాసానికి వెళ్లి పూలమ్మను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పూలమ్మ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షిస్తూ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆమెకు అందుతున్న వైద్య సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కుంట్లూరులో సాంక్టస్ వరల్డ్ స్కూల్
# నాలుగో బ్రాంచ్ ప్రారంభం



- ఫిన్‌లాండ్ విద్యా నమూనాతో అంతర్జాతీయ ప్రమాణాల విద్య అందిస్తాం
- ముఖ్య అతిథిగా ఫిన్‌లాండ్ కౌన్సిల్ జనరల్ ఎరిక్ ఏ.ఎఫ్. హాల్‌స్ట్రూమ్

**విశాలభారతి , అబ్దుల్లాపూర్‌మెట్ :**

హయత్‌నగర్ పరిధిలోని కుంట్లూరు గ్రామంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నూతనంగా ఏర్పాటు చేసిన సాంక్టస్ వరల్డ్ స్కూల్ నాలుగో బ్రాంచ్‌ను ఫిన్‌లాండ్ కౌన్సిల్ జనరల్ ఏరిక్ ఏ . ఎఫ్ . హల్లస్రుమ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఘనంగా ప్రారంభించారు. ఆధునిక విద్యా సదుపాయాలు, ఫిన్నిష్ విద్యా విధానానికి అనుగుణంగా రూపొందించిన బోధనా పద్ధతులతో ఈ విద్యాసంస్థ స్థానిక విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా ఎరిక్ ఏ.ఎఫ్. హాల్‌స్ట్రూమ్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ విద్యా విధానంగా గుర్తింపు పొందిన ఫిన్నిష్ విద్యా నమూనాను భారతీయ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడంలో సాంక్టస్ వరల్డ్ స్కూల్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. విద్యార్థులపై కేవలం పాఠ్యభారం మోపకుండా, వారి సృజనాత్మకత, ఆలోచనా సామర్థ్యం, శారీరక దృఢత్వం పెంపొందేలా విద్యాబోధన జరగాలని పేర్కొన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి క్రమశిక్షణ, మానసిక వికాసం, సామాజిక బాధ్యత కూడా సమానంగా అవసరమని, తరగతి గదుల్లో విద్యార్థుల ప్రవర్తనను మనోవిజ్ఞాన శాస్త్రంతో అనుసంధానిస్తూ బోధన సాగించాల్సిన అవసరం ఉందని సూచించారు. పాఠశాల యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ.. ఫిన్నిష్ విద్యా విధానాన్ని భారతీయ విద్యా వ్యవస్థకు అనుగుణంగా మలచి విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి తరగతి గదిలో కృత్రిమ మేధస్సు (AI) ఆధారిత ఇంటరాక్టివ్ ఎల్ఈడీ ప్యానెల్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ డిజిటల్ సదుపాయాల ద్వారా శ్రవణ, దృశ్య పద్ధతిలో విద్యార్థులకు పాఠాలు బోధించనున్నట్లు చెప్పారు. పాఠశాలలో ఆధునిక గ్రంథాలయం, కంప్యూటర్ ప్రయోగశాల, సంగీతం మరియు నృత్య గదులు, మల్టీమీడియా విభాగం, కుండల తయారీ ప్రయోగశాల వంటి ప్రత్యేక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఈ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. స్కూల్ నిర్వాహకులు రాజేశ్వర్ రెడ్డి, హనుమంతు రెడ్డి మాట్లాడుతూ.. మొత్తం నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఒక ఎకరాన్ని విద్యా బోధన కోసం, మిగిలిన మూడు ఎకరాలను క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఇందులో ఈత కొలను, ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు, అథ్లెటిక్ ట్రాక్, బాస్కెట్‌బాల్, క్రికెట్, టెన్నిస్, పికిల్‌బాల్ సహా దాదాపు 20 రకాల ఇండోర్, అవుట్‌డోర్ క్రీడా సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం తొలి విద్యా సంవత్సరంలోనే 50 మంది ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో విద్యాబోధన ప్రారంభించినట్లు యాజమాన్యం తెలిపింది. శంషాబాద్, బీఎన్ రెడ్డి నగర్, కోకాపేటల తర్వాత కుంట్లూరులో ప్రారంభమైన ఈ నాలుగో బ్రాంచ్ ద్వారా స్థానిక విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు కుంట్లూర్ గ్రామ మాజీ సర్పంచ్ కళ్లెం ప్రభాకర్ రెడ్డి, ప్రముఖులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాఠశాల ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

# గ్రేటర్ ఎన్నికల్లో మేయర్ పీఠం బీజేపి దే

- మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్



**సికింద్రాబాద్,విశాలభారతి:** యాదగిరిగుట్టలో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ప్రశిక్షణ శిబిరంలో కేంద్ర మంత్రివర్యులు కిషన్ రెడ్డి , మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ,బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు,కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారని మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ తెలిపారు.ప్రతి మూడు సంవత్సరాలకు జరిగే ఈ శిక్షణా శిబిరాలు బీజేపీ ప్రత్యేకత. కాలానుగుణంగా మార్పులను అధ్యయనం చేస్తూ ముందుకు సాగే పార్టీ బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఎదిగింది" అని ఆమె అన్నారు. మోదీ గారి 12 ఏళ్ల పాలన "ప్రజల చేత ఎన్నికై వరుసగా మూడు పర్యాయాలు ప్రధానిగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసిన ఘనత నరేంద్ర మోదీ గారిదే. రాబోయే 8 ఏళ్లు కూడా ఆయనే దేశానికి నాయకత్వం వహిస్తారు" అని స్వరూప గౌడ్ అన్నారు. హైదరాబాద్ అభివృద్ధి"అమృత్, స్మార్ట్ సిటీ, స్వనిధి పథకాలతో హైదరాబాద్ అభివృద్ధికి కేంద్రం కృషి చేస్తోంది. రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇస్తే హైదరాబాద్‌ను ఆదర్శ నగరంగా మారుస్తాం. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మజ్లిస్ కనుసన్నల్లో పనిచేస్తూ నగరాన్ని అభివృద్ధి చేయలేవు" గ్రేటర్ మేయర్ పీఠం మాదేనని స్వరూప గౌడ్ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బండ కార్తీక రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బండా విజయలక్ష్మి, రవి ప్రసాద్ గౌడ్, రాచమల్ల కృష్ణమూర్తి, శారదామల్లేష్,కనకట్ల హరి,నాగేష్ రెడ్డి, వెంకటేష్‌గౌడ్, అజయ్, సాయి ప్రసాద్ గౌడ్, నేతి సత్యనారాయణ, వినయ్ గుప్త,నరేష్, శ్రీనివాస్,క్రాంతి గిరి తదితరులు ఉన్నారు.

# మణుగూరు పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.. పలు అభివృద్ధి పనులకు భూమిపూజ, పనులు ప్రారంభం



**విశాలభారతి, మణుగూరు :** మణుగూరు పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది అని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద రూ.39 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. అనంతరం శివలింగాపురం గ్రామంలో రూ. 42 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు భూమి పూజ నిర్వహించారు. అలాగే సురక్ష బస్టాండ్, శేషగిరి నగర్ సమీపంలో రూ .47 లక్షల అంచనా వ్యయం తో నిర్మించనున్న సైడ్ డ్రైనేజీ పనులకు ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, మణుగూరు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు, పట్టణంలో మౌలిక వసతులను మరింత బలోపేతం చేసేందుకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మణుగూరు పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వర్షాకాలం లో నీటి నిలువలు, మురుగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో ఈ రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రజల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని ఎమ్మెల్యే అన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఏఈ సత్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, శానిటరీ జవాన్ నరేందర్, అలాగే కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, దొబ్బల వెంకటప్పయ్య, మైనారిటీ అధ్యక్షులు రహీం భాషా, 14వ వార్డు అధ్యక్షులు దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు సామ శ్రీనివాస్ రెడ్డి, తాత ప్రసాద్, గణేష్ రెడ్డి, పాతూరు వెంకన్న, తోపుడి శ్రీను, డీవీ, జరుపుల జగన్, పురం రవి, చింతల కృష్ణ, కొర్లకుంట అప్పారావు, అబ్దుల్లా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ ప్రాజెక్ట్‌ను వెంటనే రద్దు చేయాలి



- 'జీవో నెం.20' ఉపసంహరణకు గ్రామస్తుల డిమాండ్
- బండరావిరాల గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు

**విశాలభారతి , అబ్దుల్లాపూర్‌మెట్ :**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామ సర్వే నెం.268లో ప్రతిపాదిత 494 ఎకరాల భారీ డంపింగ్ యార్డ్ (ఎకో టౌన్) ప్రాజెక్టును తక్షణమే రద్దు చేయాలని, ఇందుకు సంబంధించిన 'జీవో నెం.20'ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని బండరావిరాల గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఇటీవల కోహెడ అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపన సభలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బండరావిరాల గ్రామంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ప్రాజెక్ట్ గురించి వాస్తవాలను దాచిపెట్టి, ప్రతిపక్షాల తప్పుడు ప్రచారంగా చిత్రీకరించడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని ఆరోపించారు. గ్రామం పేరు ప్రస్తావించకుండా సభలో మాట్లాడిన ఎమ్మెల్యే, ప్రజల ఆందోళనలను తేలికగా తీసుకున్నారని విమర్శించారు. అయితే అధికారిక ఉత్తర్వుల్లో స్పష్టంగా బండరావిరాల గ్రామ సర్వే నెంబర్ 268లో 494 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్ట్ ప్రతిపాదితమైందని పేర్కొన్నారు. నిజంగా ప్రజల పక్షాన ఉంటే, ముఖ్యమంత్రి సమక్షంలోనే ప్రాజెక్టును రద్దు చేయాలని ఎందుకు డిమాండ్ చేయలేదని ప్రశ్నించారు.ఎమ్మెల్యే ఇంకా ఏమీ కాలేదు, ప్రజలు అధైర్యపడవద్దు అని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలు వేరే విధంగా ఉన్నాయని సర్పంచ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సభ ప్రారంభానికి కొన్ని గంటల ముందే టీజీఐఐసీ (TGIIC) అధికారులు ప్రతిపాదిత స్థలాన్ని సందర్శించారని, విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు వారితో మాట్లాడేందుకు వెళ్లగా అధికారులు ప్రజలను చూసి అక్కడి నుంచి వెళ్లిపోయారని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికే జీవో నెం.20 జారీ చేయడమే కాకుండా, జపాన్‌కు చెందిన కిటాక్యుష సంస్థతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్న నేపథ్యంలో ఇంకా ఏమీ కాలేదు అని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు.బండరావిరాల గ్రామ ప్రజలు ఇప్పటికే పరిసర ప్రాంతాల్లో ఉన్న క్రషర్ల వల్ల తీవ్రమైన కాలుష్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ధూళి, శబ్ద కాలుష్యంతో పాటు శ్వాసకోశ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని, పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో హైదరాబాద్ నగర చెత్తను గ్రామ పరిసరాల్లో డంప్ చేసే ప్రాజెక్టును తీసుకురావడం ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర ముప్పు అని పేర్కొన్నారు. కోహెడ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్ట్ గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం పట్ల కూడా గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి చట్టాలు, పరిపాలనా వ్యవహారాలపై పూర్తి అవగాహన ఉందని, నిజంగా ప్రజల పక్షాన ఉంటే వెంటనే జీవో నెం.20 రద్దు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ ప్రయోజనాల కోసం గ్రామాల భవిష్యత్తును తాకట్టు పెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతంలోని 15 గ్రామాల ప్రజలమంతా కలిసి ప్రజా ప్రయోజనాల కోసం పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. ప్రభుత్వం వెంటనే ఈ వివాదాస్పద ప్రాజెక్టును రద్దు చేయాలి అని గ్రామ ప్రజలు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు కన్నె భరత్ యాదవ్, ఏర్పుల హరికృష్ణ, కందికంటి అనూష ప్రవీణ్, యువ నాయకులు గుండ్ల సతీష్ యాదవ్, ఏర్పుల నరేష్, ఒంగూరి రమేష్, కొత్త శ్రీకాంత్ గౌడ్, నేమురగోముల కరుణ్ తదితరులు పాల్గొని గ్రామ ప్రజల ఆందోళనకు మద్దతు తెలిపారు.

# చేపల కోసం ఎగబడ్డ జనం

- మార్కెట్లో సందడి వాతావరణం

**ఆర్మూర్, విశాలభారతి:** మృగశిర కార్తె సందర్భంగా చేపలు కొనుగోలు చేయడానికి ప్రజలు ఉదయం నుండి మార్కెట్లోకి, గ్రామాలలో చెరువుల వద్దకు వెళ్లారు. దీంతో చేపల కొరకు జనాలు ఎగబడ్డారు ఒక్కసారిగా సందడి వాతావరణం నెలకొంది. మృగశిర కార్తె రోజున చేపలను తినడం ఆనవాయితీగా వస్తుంది. మృగశిర కార్తె మొదలవగానే వర్షాలు కురుస్తాయి, ఒక్కసారిగా వాతావరణం లో మార్పులు సంభవిస్తాయి. శరీరంలో ఉష్ణోగ్రతలు తగ్గి పోతాయి వ్యాధి నిరోధక శక్తి తగ్గి ప్రజలు అనారోగ్యం బారిన పడతారు. ఈ సీజన్ లో జీర్ణశక్తి కూడా మందగిస్తుంది. శరీరంలో ఉష్ణోగ్రతలను సమతుల్యం చేసి ఇమ్యూనిటీని పెంచడానికి చేపలు దోహదపడతాయి. అందుకే మృగశిర కార్తె రోజున చేపలను తింటారు.



# కురవి పెట్రోల్ బంకులో సిబ్బంది నిర్వాకం..!

- పెట్రోల్ బంకులో భారీ నిర్లక్ష్యం వెలుగులోకి.
- డీజిల్‌కు బదులు పెట్రోల్ పోసి కస్టమర్‌పై దబాయింపు.
- తప్పు చేసి తలదించుకోవాల్సింది పోయి దబాయింపు..!
- బంకులో తప్పిదం.. ఇంజిన్‌కు ముప్పు
- కురవి పెట్రోల్ బంకులో కస్టమర్లకు చుక్కలు..
- వాహనం ఇంజిన్ దెబ్బతింటుందంటూ బాధితుడి ఆందోళన
- స్థానికుల మద్దతుతో బంకు యాజమాన్యాన్ని నిలదీసిన వాహనదారుడు.
- వాహనదారుల భద్రతతో చెలగాటమా..? కురవి బంకుపై విమర్శలు



**కురవి విశాల భారతి:**

మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని ఓ పెట్రోల్ బంకులో సిబ్బంది నిర్వాకం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వాహనదారుడి మాటలను నిర్లక్ష్యం చేసి, డీజిల్‌కు బదులు పెట్రోల్ పోయడమే కాకుండా.., ఎదురుతిరిగి దబాయించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఒక వాహనదారుడు తన డీజిల్ వాహనంలో రూ. 1000 విలువైన డీజిల్ పోయాల్సిందిగా బంకు సిబ్బందికి స్పష్టంగా చెప్పాడు. అయితే, అక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఏమరపాటుగా డీజిల్‌కు బదులు పెట్రోల్ పోశారు. దీనిని గమనించిన సదరు కస్టమర్.. తాను డీజిల్ పోయమంటే పెట్రోల్ ఎందుకు పోశారని సిబ్బందిని నిలదీశారు. తమ తప్పును ఒప్పేసుకొని క్షమాపణ చెప్పాల్సింది పోయి, బంకు సిబ్బంది సదరు వాహనదారుడిపైనే ఎదురుదాడికి దిగారు. తాము కరెక్ట్‌గానే పోశామంటూ బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇస్తూ దబాయించడం మొదలుపెట్టారు. సిబ్బంది ప్రవర్తనతో విసిగిపోయిన వాహనదారుడు స్థానికుల మద్దతుతో బంకు యజమాన్యాన్ని నిలదీశారు. పెట్రోల్ పోయడం వల్ల వాహనం ఇంజిన్ పాడైపోయే ప్రమాదం ఉందని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ బంకులో సిబ్బంది నిర్లక్ష్యంపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సదరు బంకుపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## తల్లిదండ్రులు విద్యార్థులపై ఒత్తిడి పెంచొద్దు

**శాలివాహన విద్యా శిరోమణి అవార్డు కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**



**విశాలభారతి,ఇందూరు :** తల్లిదండ్రులు విద్యార్థులపై ఒత్తిడి పెంచొద్దని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. శాలివాహన ( కుమ్మర ) ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని అంబేద్కర్ భవన్లో విద్యార్థులకు విద్య శిరోమణి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పదో తరగతి, ఇంటర్మీడియట్ లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నతమైన లక్ష్యంతో ముందుకెళ్లాలని సూచించారు. జిల్లాకు దేశానికి మంచి పేరు తేవాలని చెప్పారు. విద్యను ఎవరు దొంగిలించే అవకాశం లేదని, విద్యతోనే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చన్నారు. ప్రధానంగా ప్రతి విద్యార్థి స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉండాలని, ఫోన్లతో మంచి ఎంతో చెడు కూడా అంతకు రెట్టింపు ఉంటుందన్నారు. కుమ్మర కులస్తులు రాజకీయంగా ముందుకు రావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, శాలివాహన కులస్తులకు ప్రత్యేక గుర్తింపునిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అవార్డులు అందజేశారు. అంతకుముందు విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కుమ్మర ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ భూపతి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ రావు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సాయికుమార్, జిల్లా గౌరవాధ్యక్షులు కనకం గంగాధర్, సంఘ సభ్యులు హనుమాన్లు విసిగిరి గంగారం, ఆర్ కే ప్రజాపతి, సిర్పూరు చిన్నయ్య, జిల్లా మాజీ అధ్యక్షులు చందూర్ బాబు, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీ నారాయణ, బీజేపీ నాయకులు పవన్ ముందడ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవం: ముందస్తు గుర్తింపే ప్రాణరక్షణకు కీలకం

**విశాలభారతి,నిజామాబాద్ ప్రతినిధి :** ప్రతి సంవత్సరం జూన్ 8న ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా మెదడు కణితులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, ముందస్తు నిర్ధారణ ప్రాముఖ్యతను తెలియజేయడం మరియు బాధితులకు మెరుగైన చికిత్స అందించాలనే లక్ష్యంతో కార్యక్రమాలు చేపడతారు. ఈ సందర్భంగా న్యూరో సర్జన్ డా. కృష్ణాదిత్య మాట్లాడుతూ, బ్రెయిన్ ట్యూమర్ అనేది మెదడులో అసాధారణంగా కణాలు పెరగడం వల్ల ఏర్పడే పరిస్థితి అని తెలిపారు. ఇది నిరపాయ (Benign) లేదా ప్రమాదకర (Malignant) స్వభావం కలిగి ఉండవచ్చన్నారు. తరచూ తలనొప్పి రావడం, వాంతులు, మూర్ఛలు, చూపు మందగించడం, శరీర భాగాల్లో బలహీనత, నడకలో తడబాటు, జ్ఞాపకశక్తి తగ్గడం, ప్రవర్తనలో మార్పులు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఈ లక్షణాలు బ్రెయిన్ ట్యూమర్‌కు సంకేతాలు కావచ్చని పేర్కొన్నారు. బ్రెయిన్ ట్యూమర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స ఫలితాలు మెరుగ్గా ఉంటాయని, ఆధునిక వైద్య సాంకేతికతతో MRI, CT స్కాన్‌ల ద్వారా ఖచ్చితమైన నిర్ధారణ సాధ్యమవుతోందని తెలిపారు. ప్రస్తుతం మైక్రోసర్జరీ, న్యూరో నావిగేషన్, ఎండోస్కోపిక్, మినిమల్లీ ఇన్వేసివ్ పద్ధతుల ద్వారా మెదడు కణితులను సురక్షితంగా తొలగించే అవకాశం ఉందన్నారు. అవసరాన్ని బట్టి రేడియేషన్ థెరపీ, కీమోథెరపీ వంటి చికిత్సలను కూడా అందిస్తున్నట్లు వివరించారు. ప్రజలు తలనొప్పిని సాధారణ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేయకుండా, లక్షణాలు కొనసాగితే వెంటనే న్యూరో వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవం సందర్భంగా బ్రెయిన్ ట్యూమర్లపై ఉన్న అపోహలను తొలగించి, ముందస్తు నిర్ధారణ మరియు సమయానికి చికిత్స ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. నిజామాబాద్‌లోని మెడికవర్ హాస్పిటల్స్‌లో ఆధునిక న్యూరోసర్జరీ సేవలు, అత్యాధునిక నిర్ధారణ సదుపాయాలు, నిపుణుల వైద్య బృందంతో బ్రెయిన్ ట్యూమర్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## భక్తజన సంద్రమైన బాసర ఆలయం



**విశాలభారతి,బాసర :** భారతదేశంలోని పవిత్ర పుణ్యక్షేత్రం చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సుదూర అనగా తెలంగాణ మహారాష్ట్ర కర్ణాటక ఒరిస్సా తమిళనాడు రాష్ట్రాల నుండి కాకుండా దూర ప్రాంతాల నుండి భక్తులు భారీ సంఖ్యలో బాసరయానికి తరలిరాగా కొందరు రైలు, బస్సు మార్గాన కాకుండా తమ తమ ప్రత్యేక వాహనాలు తరలివచ్చి ముందుగా పుణ్య గోదావరి నదిలో స్నానాలు ఆచరించి నది ఒడ్డున గల సర్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. నేరుగా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి బయలుదేరి అక్కడ భారీకేడ్లలో దర్శనార్థం కొందరు భక్తులు తమ తమ చిన్నారులకు అక్షర శ్రీకారాలు దిద్దగా మరికొందరు కుంకుమార్చన శిఖర దర్శనం ప్రత్యేక దర్శనాలు చేపట్టారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల తో పాటు కళాశాలలో పున ప్రారంభం కావడంతో విద్యార్థిని విద్యార్థులతో పాటు ఆదివారం సెలవు రోజు ఉండడం వలన కొందరు ఉద్యోగులు కుటుంబ సమేతంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారి మహా మంగళహారతి సేవలో పాల్గొని నేరుగా ఆలయ అన్నదాన మహా ప్రసాదాన్ని స్వీకరించారు. అంతేకాకుండా రైల్వే స్టేషన్ కూడలితోపాటు ఆలయ ప్రాంగణంలో చిరు దుకాణాల వద్ద చిన్నారులచే ఆట బొమ్మలు కొనడానికి ఎటుచూసినా ఆలయ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. రుద్రాభిషేకం 102 టికెట్లకు గాను ఆదాయం, 51,000 సమకూరగా, అష్టోత్తరము, 59, టికెట్లకు గాను, ఆదాయం 11,800, ప్రత్యేక అక్షర అభ్యాసము టికెట్లు 222 గాను ఆదాయం,2,27,050, అదేవిధంగా సాధారణ అక్షరాభ్యాసాలు, టికెట్లు,716, ఆదాయం, 1,07,400 అక్షర అభ్యాస మండప ప్రవేశం టికెట్లు 1365 కు గాను ఆదాయం,1,36,500, మండప ప్రవేశం టికెట్లు,154, ఆదాయం,7,700, అక్షరాభ్యాస మండప ప్రవేశం టికెట్లు,86, ఆదాయం 4,300 లడ్డు ప్రసాదము టికెట్లు 7,300 ఆదాయం, 1,82,500, పులిహోర ప్రసాదము టికెట్లు 4,200 ఆదాయం,08,400, అభిషేక మహా లడ్డు ప్రసాదము, టికెట్లు 679 ఆదాయం,101,850 మొత్తం ఆదాయం, 9,140,50 సమకూరినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా ఆదివారం దాదాపు పదివేల పైన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఉంటారని అంచన వేశారు.

## మున్సిపల్ కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి



**పాల్వంచ, విశాలభారతి:**

కొత్తగూడెం కార్పొరేషన్ లోని పాల్వంచ డివిజన్ పరిధిలో పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేసారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బ్యాంకు రుణాలు, కార్మికుల వేతనాలు, నిర్మాణ సామగ్రి సరఫరాదారుల చెల్లింపులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నెల 18న హైదరాబాదులో జరిగే మహాసభకు సంఘీభావం తెలుపతామని,డివిజనల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంట్రాక్టర్లు,పాల్గొన్నారు.

## పాము కాటుతో నాలుగేళ్ల చిన్నారి మృతి

**రాజేంద్రనగర్, విశాల భారతి :**



శంషాబాద్ మండల పరిధిలోని కాచారం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. పాము కాటుతో నాలుగేళ్ల చిన్నారి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాచారం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 85లో ఉన్న భూమిలో వ్యవసాయ పనులు చేసుకుంటూ నివసిస్తున్న రాహుల్ పరభూయే కుటుంబ సభ్యులు గత ఏడాది నుంచి అక్కడే ఉంటున్నారు. అదే ప్రాంతంలో అతని అన్న అయిన చోటు పరభూయే తన కుటుంబంతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ నివసిస్తున్నాడు. జూన్ 6 రాత్రి సమయంలో కుటుంబ సభ్యులు భోజనం అనంతరం గది బయట నిద్రపోయారు. జూన్ 7 అర్ధరాత్రి సమయంలో చోటు పరభూయే కుమార్తె పల్లవి (4) ఒక్కసారిగా గట్టిగా ఏడవడంతో కుటుంబ సభ్యులు అప్రమత్తమయ్యారు. పరిశీలించగా చిన్నారి పక్కనే విషపాము కనిపించగా, ఆమె కడుపు దిగువ భాగంలో పాము కాటుకు గురైనట్లు గుర్తించారు. వెంటనే చిన్నారిని శంషాబాద్‌లోని ట్రైడెంట్ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారుజామున 2:40 గంటల సమయంలో చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

## హరిత భవిష్యత్తు కోసం సైక్లింగ్: కామారెడ్డిలో ఫిట్ ఇండియా ర్యాలీ



**విశాలభారతి, కామారెడ్డి:**

ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా ఆదివారం కామారెడ్డి పట్టణంలో "హరిత భవిష్యత్తు కోసం సైక్లింగ్" అనే ఇతివృత్తంతో ఫిట్ ఇండియా మూవ్‌మెంట్ సైక్లింగ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జెండా ఊపి ప్రారంభించారు.

**కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సహకారం**

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో ఫిట్ ఇండియా ఉద్యమం కింద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

**ఆరోగ్యకర జీవనశైలి, కాలుష్య నియంత్రణే లక్ష్యం**

ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే సైక్లింగ్‌ను ప్రజల్లో ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు.

**రోజువారీ జీవితంలో సైక్లింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి: కలెక్టర్**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సైక్లింగ్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేయడమే కాకుండా కాలుష్య నియంత్రణకు కూడా దోహదపడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో సైక్లింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజంతో పాటు పచ్చని పర్యావరణాన్ని నిర్మించడంలో భాగస్వాములు కావాలని సూచించారు.

**దేశవ్యాప్తంగా నిర్వహణ**

దేశవ్యాప్తంగా ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**యువత, అధికారుల ఉత్సాహభరిత భాగస్వామ్యం**

యువత, విద్యార్థులు, క్రీడాకారులు, ప్రభుత్వ అధికారులు, వివిధ వర్గాల ప్రజలు ఉత్సాహంగా ఈ సైక్లింగ్ ర్యాలీలో పాల్గొన్నారు.

**అదనపు కలెక్టర్ సహా అధికారుల హాజరు**

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్‌వీ గిరి, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, క్రీడా సంఘాల సభ్యులు, యువత తదితరులు పాల్గొన్నారు.

## ప్రీప్రైమరీ పాఠశాలల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

**ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలి : ఎంఈఓ శ్రీనివాస్**

**విశాల భారతి – అబ్దుల్లాపూర్‌మెట్ :** హయత్‌నగర్ మండల పరిధిలోని ప్రభుత్వ ప్రీప్రైమరీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఇన్‌స్ట్రక్టర్, ఆయాల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హయత్‌నగర్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) శ్రీనివాస్ తెలిపారు. నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ..మండలంలోని పీఎస్ ఎన్జీవో కాలనీ, పీఎస్ వనస్థలిపురం, పీఎస్ ఇన్మల్, పీఎస్ హయత్‌నగర్ (హెచ్‌డబ్ల్యూ) ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. ఈ పోస్టులకు ఇంటర్మీడియట్ తో పాటు ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్, ప్రీస్కూల్ డిప్లొమా, టిటిసి లేదా డీఈడీ ఉత్తీర్ణత కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. అదేవిధంగా ఆయా పాఠశాలల్లో ఆయాల పోస్టుల భర్తీకి కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఆయాల పోస్టులకు కనీసం ఏడో తరగతి ఉత్తీర్ణతతో పాటు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ తాజా పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో పాటు విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాల ప్రతులను జతచేసి ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని ఎంఈఓ సూచించారు. దరఖాస్తులను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు లేదా హయత్‌నగర్ ఎంఆర్సీ కార్యాలయంలో కార్యాలయ పనిదినాల్లో అందజేయవచ్చని తెలిపారు.ప్రీప్రైమరీ విద్యా బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, చిన్నారుల విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలనుకునే అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంఈఓ శ్రీనివాస్ కోరారు. మండలంలోని నిరుద్యోగ మహిళలకు ఈ నియామకాలు ఉపాధి అవకాశాలను కల్పించనున్నాయని ఆయన పేర్కొన్నారు.

## తారామతిపేటలో విషాదం

- రోడ్డు దాటుతుండగా కార్ ఢీకొని ఐదేళ్ల బాలుడు మృతి
- నిర్లక్ష్యంగా వాహనం నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు

**విశాలభారతి , అబ్దుల్లాపూర్‌మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదేళ్ల బాలుడు మృతి చెందిన విషాదకర ఘటన చోటుచేసుకుంది. రోడ్డు దాటుతున్న బాలుడిని వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తారామతిపేట గ్రామంలోని గుడిసెల ప్రాంతానికి చెందిన మేకల శ్రీకాంత్ (5) అనే బాలుడు ఆదివారం సాయంత్రం సుమారు 5.20 గంటల సమయంలో గ్రామంలోని మహంకాళి ఆలయం వెనుక భాగంలో రోడ్డు దాటుతున్నాడు. ఇదే సమయంలో ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డు నుంచి తారామతిపేట గ్రామం వైపు వస్తున్న టాటా ఇండికా కారు (నంబర్: TS09EB2073) బాలుడిని ఢీకొట్టింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంతో వాహనం నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో బాలుడు తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆడుకుంటూ, రోడ్డు దాటుతుండగా జరిగిన ఈ ప్రమాదంలో చిన్నారి ప్రాణాలు కోల్పోవడంతో తారామతిపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రస్తుతం పోలీసులు ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## మహబూబాబాద్ యువకుడికి 'ఉత్తమ కవిత' అవార్డు

- రాజులకొత్తపల్లి కవి వరిపల్లి అనిల్ కుమార్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి :** ప్రతిష్ఠాత్మక 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో మహబూబాబాద్ జిల్లాకు చెందిన యువ కవి వరిపల్లి అనిల్ కుమార్ 'ఉత్తమ కవిత అవార్డు' అందుకుని జిల్లాకు అరుదైన గౌరవాన్ని తీసుకువచ్చారు. నెల్లికుదురు మండలం రాజులకొత్తపల్లి గ్రామానికి చెందిన అనిల్ కుమార్ అంతర్జాతీయ వేదికపై తన సాహిత్య ప్రతిభను చాటుకుని ఈ విశిష్ట పురస్కారాన్ని కైవసం చేసుకున్నారు. ప్రపంచంలోని పలు దేశాలతో పాటు భారతదేశం నలుమూలల నుంచి ప్రముఖ కవులు, రచయితలు, పరిశోధకులు, సాహితీవేత్తలు పాల్గొన్న ఈ మహాసభల్లో అనిల్ కుమార్ రచించిన కవిత ఉత్తమ కవితగా ఎంపికైంది. శనివారం నిర్వహించిన ఘన సభలో సాహితీ దిగ్గజాల సమక్షంలో ఆయనకు అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేసి సన్మానించారు. ప్రపంచ స్థాయి సాహిత్య వేదికపై మహబూబాబాద్ జిల్లా, నెల్లికుదురు మండలం, రాజులకొత్తపల్లి గ్రామం పేరును నిలబెట్టిన అనిల్ కుమార్ విజయంపై జిల్లా ప్రజలు, సాహితీ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వరిపల్లి అనిల్ కుమార్ మాట్లాడుతూ, "ప్రపంచ స్థాయి వేదికపై మన ప్రాంతం పేరును చాటిచెప్పే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ ప్రయాణంలో నన్ను ప్రోత్సహించిన కుటుంబ సభ్యులు, మిత్రులు, గ్రామ ప్రజలు, శ్రేయోభిలాషులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు" అని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అవార్డు సాధించి జిల్లా కీర్తి పతాకాన్ని ఎగురవేసిన వరిపల్లి అనిల్ కుమార్‌కు గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, కవులు, సాహితీ అభిమానులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## బీఎస్ఎఫ్ జవాన్‌గా చరణ్ కుమార్ ఎంపిక



**మహబూబాబాద్ విశాల భారతి :** కేసముద్రం మండల కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన చింతకుంట్ల చరణ్ కుమార్ (19) సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) లో జవాన్‌గా ఎంపికై కుటుంబానికి, గ్రామానికి గర్వకారణంగా నిలిచాడు. తాపీ మేస్త్రి ముత్తయ్య, ఆశా వర్కర్ పుష్పలత దంపతుల కుమారుడైన చరణ్ కుమార్ స్వయంకృషితో ఈ విజయాన్ని సాధించాడు. ఉద్యోగం సాధించిన అనంతరం సామాజిక నాయకుడు సమ్మిగౌడ్ చిలువేరును కలిసి ఆశీర్వాదాలు తీసుకున్న చరణ్ కుమార్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సమ్మిగౌడ్ మాట్లాడుతూ, పేదరికం విజయానికి అడ్డంకి కాదని చరణ్ నిరూపించాడని కొనియాడారు. భవిష్యత్తులో ఐపీఎస్ అధికారిగా ఎదిగి దేశానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. సమ్మిగౌడ్ అందించిన ప్రోత్సాహం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో ఐపీఎస్ సాధించి దేశ సేవలో ముందుంటానని చరణ్ కుమార్ తెలిపారు.

## ఆహార భద్రత శిక్షణ, ధృవీకరణ పై శిక్షణ

**అంగన్‌వాడీలకు అవగాహనా కల్పించిన అధికారులు**

**భద్రాద్రి ప్రతినిధి:విశాలభారతి:** ఆహార భద్రతా కమిషనర్ సంగీత సత్యనారాయణ ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాలికలో భాగంగా, ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆహార భద్రతా విభాగం ఆధ్వర్యంలో జిల్లాలోని అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు ఆహార భద్రత శిక్షణ, ధృవీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నుండి మొత్తం 300 మంది అంగన్‌వాడీ ఉపాధ్యాయులు రెండు బ్యాచ్‌లలో పాల్గొన్నారు. దీనితో పాటుగా అంగన్‌వాడీల కోసం రిజిస్ట్రేషన్ మేళా కూడా నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా డిఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ తుకారాం రాథోడ్ మాట్లాడుతూ.. సురక్షితమైన ఆహారం, సురక్షితమైన ఆరోగ్యం ప్రధాన ఉద్దేశ్యంగా ఉండాలని అన్నారు. జిల్లాలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తామని, కల్తీపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార భద్రతా అధికారి శరత్ తెలిపారు. ఏవైనా ఫిర్యాదుల కోసం కొత్తగూడెం, ఐడిఓసి, 1వ అంతస్తు, రూమ్ నెం. ఎఫ్3 లోని కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.





# షూటింగ్‌లో కో-స్టార్ వేధింపులు

బాలీవుడ్, మరాఠీ చిత్ర పరిశ్రమలలో గుర్తింపు తెచ్చుకున్న నటి ప్రియా బాపట్ తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న ఒక చేదు అనుభవాన్ని తాజాగా పంచుకుంది. తన మొదటి సినిమా షూటింగ్ సమయంలో ఒక పాట చిత్రీకరణలో సహ నటుడు తనకు నచ్చకపోయినా పదే పదే ముద్దు పెట్టుకున్నాడని, ఆ సమయంలో తాను తీవ్ర అసౌకర్యానికి గురయ్యానని ఆమె వెల్లడించారు. కథా చర్చల సమయం నుంచే తాను ఆ ముద్దు సీన్ అవసరమా అని దర్శకుడిని ప్రశ్నించానని, అయితే షూటింగ్ స్పాట్‌లో మాత్రం సదరు నటుడు స్క్రిప్ట్‌లో లేని విధంగా, ఇంప్రూవైజేషన్ పేరుతో హద్దులు దాటి ప్రవర్తించాడని ప్రియా బాపట్ పేర్కొన్నారు. ఆ సమయంలో ఏం చేయాలో తోచక, తన గొంతు ఎలా వినిపించాలో తెలియక ఎంతో నిస్సహాయంగా ఉండిపోయానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఇబ్బందికరమైన వాతావరణం కేవలం షూటింగ్‌తోనే ముగిసిపోలేదని, తామిద్దరూ ఒకే హోటల్‌లో బస చేసినప్పుడు, తాను ఎన్నిసార్లు నిరాకరించినా ఆ నటుడు బ్రేక్‌ఫాస్ట్ లేదా డిన్నర్‌కు రమ్మంటూ పదే పదే వేధించాడని ప్రియ తెలిపారు. ఈ ఘటనతో తీవ్ర ఆందోళనకు గురైన తాను ప్రతిరోజూ రాత్రి తన భర్త ఉమేష్ కామత్‌కు ఫోన్ చేసి ఏడ్చేదాన్నని, దాంతో ఆందోళన చెందిన ఆయన వెంటనే ముంబై నుండి భోపాల్ షూటింగ్ స్పాట్‌కు వచ్చి మూడు రోజుల పాటు తనతోనే ఉన్నారని ఆమె గుర్తు చేసుకున్నారు. 'మున్నాభాయ్ MBBS' చిత్రంతో పాటు 'సిటీ ఆఫ్ డ్రీమ్స్' వెబ్ సిరీస్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రియా బాపట్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.